మీరే చదువరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

PRGI REGD NO: TGTEL/25/A1385

# నేటి ఈవార్తలు

NETI EVARTHALU దినపత్రిక

www.evarthalu.com


మీరే విలేకరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

శుక్రవారం FRIDAY 26-6-2026 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 12 PAGES:12 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 1 Volume:1 | సంచిక: 358 Issue: 358

26 జూన్ 2026 - శుక్రవారం శ్రీ పరాభవ నామ సంవత్సరం ఉత్తరాయణం - గ్రీష్మ ఋతువు జ్యేష్ఠ మాసం - శుక్లపక్షం సూర్యోదయం - తె. 5:47 సూర్యాస్తమయం - సా. 6:50 తిథి ద్వాదశి రా. 10:23 వరకు తరువాత త్రయోదశి సంస్కృత వారం భృగు వాసరః నక్షత్రం విశాఖ రా. 7:10 వరకు తరువాత అనురాధ యోగం సిద్ధ ఉ. 11:31 వరకు కరణం బవ ఉ. 9:15 వరకు భాలవ రా. 10:23 వరకు వర్జ్యం రా. 11:44 నుండి రా. 1:32 వరకు దుర్ముహూర్తం ఉ. 8:24 నుండి ఉ. 9:16 వరకు మ. 12:44 నుండి మ. 1:37 వరకు రాహుకాలం ఉ. 10:41 నుండి మ. 12:19 వరకు యమగండం మ. 3:34 నుండి సా. 5:12 వరకు గుళికాకాలం ఉ. 7:25 నుండి ఉ. 9:03 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:11 నుండి తె. 4:59 వరకు అమృత ఘడియలు ఉ. 9:25 నుండి ఉ. 11:12 వరకు అభిజిత్ ముహూర్తం ఉ. 11:52 నుండి మ. 12:45 వరకు గమనిక: "o" అనగా మరుసటి రోజున

Circulated to Telangana
Published from Jagitial

## 'పంచముఖ సంకటహర మహాగణపతి'గా ఖైరతాబాద్ గణేశ్



దేశంలోనే ప్రసిద్ధి చెందిన వినాయక మండపాల్లో ఒకటైన హైదరాబాద్‌లోని ఖైరతాబాద్ మహా గణేశుడి మహా గణపతి నమూనా పోస్టర్‌ను ఖైరతాబాద్ గణేష్ ఉత్సవ సమితి గురువారం ఆవిష్కరించింది. ఈ క్రమంలోనే ఘనంగా కర్రపూజను నిర్వహించింది. ఈసారి 69 అడుగుల ఎత్తైన విగ్రహాన్ని.. పంచముఖ సంకటహర మహా గణపతి రూపంలో తయారు చేయనున్నారు. ఈ విగ్రహ నిర్మాణం పూర్తి కావడానికి 82 రోజులు పట్టనుంది. ఈసారి ఖైరతాబాద్ బడా గణేష్ విగ్రహంలో సోమనాథ్ జ్యోతిర్లింగం, కాళికామాత ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి.

ఖైరతాబాద్-హైదరాబాద్, జూన్ 25 (ఈవార్తలు): నిర్జల ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని గురువారం రోజున ఖైరతాబాద్ గణేష్ ఉత్సవ కమిటీ, శ్రీ గణేష్ ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో సాంప్రదాయబద్ధంగా కర్రపూజ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. దీంతో ఖైరతాబాద్ మహా గణపతి ఉత్సవాలకు అంకురార్పణ జరిగినట్లయింది. ఈ పూజా తర్వాత ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్.. ఈ ఏడాది అక్కడ కొలువుదీరనున్న వినాయకుడి నమూనా పోస్టర్‌ను అధికారికంగా విడుదల చేశారు. వినాయక చవితి ఈ ఏడాది సెప్టెంబర్ 14వ తేదీన రానుండగా.. నేటితో సరిగ్గా 82 రోజులు మిగిలి ఉన్నాయి. దీంతో ఈ 82 రోజుల్లోనే సర్వ హంగులతో కూడిన 69 అడుగుల భారీ మహా గణపతి విగ్రహాన్ని పూర్తి చేస్తామని.. ఉత్సవ కమిటీ సభ్యులు స్పష్టం చేశారు. ఇక ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న యుద్ధాలు.. ఉద్రిక్తతలు తగ్గిపోయి.. అన్ని దేశాల్లో శాంతి చేకూరాలనే సంకల్పంతో ఈసారి తరువాయి 2 వ పేజీలో...

# వెనెజువెలా... విలవిల

## వరుస భూకంపాల ధాటికి 188 మంది మృతి



### 1,500 మందికి పైగా గాయాలు
### 7.2, 7.5 తీవ్రతలతో వరుస ప్రకంపనలు
### లాగ్వైరా ప్రాంతంలో భారీ విధ్వంసం

వరుస భూకంపాల ధాటికి వెనెజువెలాలో ఇప్పటి వరకు 188 మంది చనిపోయినట్లు గుర్తించారు. మరో 1,500 మంది తీవ్రంగా గాయపడ్డారు. భవనాల శిథిలాల కింద చాలా మంది చిక్కుకుపోయినట్లు అనుమానిస్తున్నారు. దీంతో మృతుల సంఖ్య భారీగా పెరిగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. గత వందేళ్లలో ఆ దేశాన్ని తాకిన అత్యంత శక్తిమంతమైన భూకంపాల్లో ఇవి ఒకటిగా నమోదయ్యాయి.

కారకాస్: రాజధాని కారకాస్‌తో పాటు పలు రాష్ట్రాల్లో తీవ్ర నష్టం సంభవించింది. ముఖ్యంగా లా గ్వైరా ప్రాంతం అత్యంత ప్రభావితమైంది. డజన్ల కొద్దీ భవనాలు నేలమట్టమవగా, శిథిలాల కింద చిక్కుకున్న వారిని వెలికితీసేందుకు సహాయక బృందాలు యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాయి. రాష్ట్ర టెలివిజన్ ప్రసారం చేసిన దృశ్యాల్లో శిథిలాల కింద చిక్కుకున్న ముగ్గురు చిన్నారులను సురక్షితంగా బయటకు తీసుకొచ్చిన ఘటన కనిపించింది. భూకంపాల సమయంలో కారకాస్‌లో భవనాలు ఊగిపోవడంతో ప్రజలు భయంతో రోడ్లపైకి పరుగులు తీశారు. పలుచోట్ల విద్యుత్, మొబైల్ సేవలు నిలిచిపోయాయి. ప్రధాన అంతర్జాతీయ తరువాయి 2 వ పేజీలో...



## ఫీ'జులుం' తప్పేం కాదు!?

### విద్యార్థుల నుంచి వసూలుకు హైకోర్టు ఓకే
### సర్కారు జీవో 9పై స్టే విధింపు
### విద్యార్థులకు షాక్.. కాలేజీలకు ఊరట

హైదరాబాద్, జూన్ 25 (ఈవార్తలు): తెలంగాణ హైకోర్టులో ప్రైవేటు కాలేజీల యాజమాన్యాలకు స్వల్ప ఊరట లభించింది. విద్యార్థుల నుంచి ఫీజుల వసూళ్లు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు సంబంధించి రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఇటీవల జారీ చేసిన జీవో నంబర్ 9 లోని మార్గదర్శకాలపై హైకోర్టు స్టే విధిస్తూ.. మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చింది. ఫీజు -2 వ పేజీలో...


## బంగారం-వెండి ధరలు



బంగారం-వెండి ధరలు (హైదరాబాద్‌లో)

| | |
|---|---|
| (గ్రాము-24 క్యారెట్స్): | రూ.14,433 |
| వెండి (కిలో): | రూ.2,40,000 |
| ప్లాటినం (గ్రాము): | రూ.4,983 |

## విశ్వవాణి



మానవ పిండం (ఎంబ్రియో) ప్రారంభ దశలో సక్రమంగా అభివృద్ధి చెందడానికి 'నానోజీ' అనే జన్యువు అత్యంత కీలకమని తాజా అధ్యయనం వెల్లడించింది. ఈ జన్యువు పనిచేయకుండా పోతే పిండం సాధారణంగా ఎదగక, శిశువు రూపుదిద్దుకునే కణాల బదులుగా సహాయక కణజాలాల ఏర్పాటుకే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తుందని శాస్త్రవేత్తలు గుర్తించారు. అంతర్జాతీయ పరిశోధకుల బృందం ఆధునిక బేస్ ఎడిటింగ్ సాంకేతికతతో మానవ ఎంబ్రియోల్లో నానోజీ పనితీరును నిలిపివేసి పరిశీలించింది. దీంతో భవిష్యత్తులో శిశువుగా మారాల్సిన మూలకణాలు సరిగా అభివృద్ధి చెందక, ప్లాసెంటా లేదా యోక్ సాక్ వంటి సహాయక నిర్మాణాల వైపు మళ్లినట్లు తేలింది.



## నేటి నుంచి ఈపీఎఫ్ఓ సేవలు బంద్!

ఉద్యోగుల భవిష్యనిధి సంస్థ (ఈపీఎఫ్ఓ) ఆన్‌లైన్ సేవలు కొన్ని రోజుల పాటు అందుబాటులో ఉండవు. సిస్టమ్ అప్‌గ్రేడ్, డేటా మైగ్రేషన్ పనుల కారణంగా సభ్యుల పోర్టల్, యజమానుల పోర్టల్, ఉమంగ్ యాప్‌లోని పలు కీలక సేవలను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు ఈపీఎఫ్‌వో ప్రకటించింది.

న్యూఢిల్లీ: జూన్ 26 నుంచి 29 వరకు ఈ సేవలు నిలిచిపోనున్నాయి. ఈ కాలంలో పీఎఫ్ క్లెయిమ్‌లు దాఖలు చేయడం, క్లెయిమ్ ప్రాసెసింగ్, ఈ-పాస్‌బుక్ వీక్షించడం, కొత్త ఉద్యోగుల యూఏఎన్ లింకింగ్, ఈసీఆర్ ఫైలింగ్ వంటి సేవలు అందుబాటులో ఉండవు. సాంకేతిక మార్పుల ద్వారా మరింత వేగవంతమైన, సురక్షితమైన తరువాయి 2 వ పేజీలో...



## పాస్‌పోర్టు ధరలు భారీగా పెంపు

### జూలై 1 నుంచి కొత్త ధరలు అమల్లోకి
### తత్కాల్, మైనర్ల పాస్‌పోర్ట్ రుసుముల్లోనూ
### నిర్వహణ ఖర్చులు పెరగడం వల్లే: విదేశాంగ శాఖ

పాస్‌పోర్ట్ జారీకి సంబంధించిన రుసుములను కేంద్ర ప్రభుత్వం భారీగా పెంచింది. సవరించిన ధరలు 2026 జూలై 1 నుంచి అమల్లోకి రానున్నాయని కేంద్ర విదేశాంగ మంత్రిత్వ శాఖ (ఎంఈఏ) వెల్లడించింది. ఈ మేరకు జూన్ 20న గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది.

న్యూఢిల్లీ: పాస్‌పోర్ట్ సేవల నిర్వహణ ఖర్చులు పెరగడంతో సుదీర్ఘ విరామం తర్వాత ఈ పెంపు నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. తాజా సవరణల ప్రకారం, సాధారణ కేటగిరీలో 36 పేజీల అడల్ట్ పాస్‌పోర్ట్ ఫీజు రూ.1,500 నుంచి రూ.2,500కి (67 శాతం పెంపు) పెరిగింది. అదేవిధంగా, 60 పేజీల పాస్‌పోర్ట్ రుసుము రూ.2,000 నుంచి రూ.3,500కి (75 శాతం పెంపు) చేరింది. తత్కాల్ స్కీమ్ కింద 36 పేజీల పాస్‌పోర్ట్‌కు రూ.5,000, 60 పేజీల తరువాయి 2 వ పేజీలో...

## రియల్ ఎస్టేట్‌ను బొందపెట్టిండు!



### రూ.కోటి విలువ భూములు రూ.60 లక్షలకూ అమ్ముడుపోవట్లే
### కేసీఆర్ హయాంలో పరిశ్రమలతో భూముల విలువలు పెరిగాయి
### సీఎం రేవంత్‌పై కేటీఆర్ మండిపాటు

చేవెళ్ల-రంగారెడ్డి, జూన్ 25 (ఈవార్తలు): తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రియల్ ఎస్టేట్ రంగం తీవ్ర సంక్షోభంలోకి వెళ్లిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. ఎన్నికల ముందు రియల్ ఎస్టేట్‌పై గొప్పలు చెప్పిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. -2 వ పేజీలో...

## యస్.. గుంపు మేస్త్రీనే!

### అభివృద్ధి గుంపును మేస్త్రీని.. సీఎం రేవంత్ రెడ్డి స్పష్టీకరణ



### రాష్ట్ర ఉద్యోగులు, పెన్షనర్లకు ఉచిత ప్రమాద బీమా
### 14 బ్యాంకులతో ప్రభుత్వం ఎంఓయూలు
### కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు కూడా వర్తింపు
### ప్రమాద బీమా కవరేజీ రూ.1 కోటి నుంచి రూ.1.5 కోట్లు
### విమాన ప్రమాద బీమా రూ.2 కోట్ల నుంచి రూ.3 కోట్లు
### పీఆర్సీ హామీని తప్పకుండా అమలు చేస్తామని సీఎం వెల్లడి

హైదరాబాద్, జూన్ 25 (ఈవార్తలు): రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు తెలంగాణ ప్రభుత్వం శుభవార్త చెప్పింది. రెగ్యులర్ ఉద్యోగులతో పాటు కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్, ఇతర తాత్కాలిక ఉద్యోగులకు కూడా ఉచిత ప్రమాద బీమా సదుపాయం కల్పించనున్నట్లు -2 వ పేజీలో...




## 9వ తరగతిలో 'ఎమర్జెన్సీ' పాఠం

న్యూఢిల్లీ: భారత దేశ చరిత్రలో అత్యంత వివాదాస్పదమైన 1975 నాటి ఎమర్జెన్సీని జాతీయ విద్యా పరిశోధన, శిక్షణ మండలి (ఎన్‌సీఈఆర్‌టీ) తొలిసారిగా పాఠ్యాంశాల్లో చేర్చింది. 9వ తరగతి సోషల్ సైన్స్ పాఠ్యపుస్తకంలో దీనికి సంబంధించిన నూతన అధ్యాయాన్ని ప్రవేశపెట్టింది. భారత ప్రజాస్వామ్య -2 వ పేజీలో...

## భారత్‌లో 4.53 లక్షల కోట్ల పెట్టుబడి


### ఏఐ, క్లౌడ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ విస్తరణకు అదనంగా 13 బిలియన్ డాలర్లు

### ముంబై, హైదరాబాద్ డేటా సెంటర్ల సామర్థ్యం పెంపు.. అమెజాన్ సీఈవో ఆండీ జెస్సీ ప్రకటన.. మోదీతో సమావేశం



న్యూఢిల్లీ: ప్రముఖ ఈ-కామర్స్ దిగ్గజం అమెజాన్, భారత్‌లో తన వ్యాపార కార్యకలాపాలను భారీగా విస్తరించేందుకు సిద్ధమైంది. ప్రధాని నరేంద్ర మోదీతో కంపెనీ సీఈఓ ఆండీ జెస్సీ సమావేశమైన అనంతరం ఈ కీలక ప్రకటన వెలువడింది. 2026 నుంచి 2030 మధ్య కాలంలో దేశంలో ఏకంగా 48 బిలియన్ డాలర్ల (సుమారు రూ. 4.53 లక్షల కోట్లు) పెట్టుబడి పెట్టనున్నట్లు అమెజాన్ ప్రకటించింది. ఈ పెట్టుబడులతో భారత మార్కెట్‌పై తమకున్న దీర్ఘకాలిక నిబద్ధతను కంపెనీ మరోసారి స్పష్టం చేసింది. భారత్‌లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), క్లౌడ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ను -2 వ పేజీలో...

## రూ.7,500 పెరిగిన మారుతి డిజైర్



## మ్యాక్‌బుక్, ఐప్యాడ్ ధరల పెంపు

# రాశి ఫలాలు

26.6.2026

మేషం: దూర ప్రయాణాలలో వాహన ఇబ్బందులుంటాయి. బంధు మిత్రులతో మాటపట్టింపులు కలుగుతాయి. వ్యాపారాలు అంతంత మాత్రంగా సాగుతాయి. ఆదాయానికి మించి ఖర్చులు ఉంటాయి. చేపట్టిన కార్యక్రమాలలో అవరోధాలు కలుగుతాయి. ఉద్యోగస్తులకు పనిభారం అధికమవుతుంది.

వృషభం: ఇతరులతో వివాదాలకు దూరంగా ఉండటం మంచిది. కుటుంబ సభ్యులు మీ మాటతో విబేదిస్తారు. ఉద్యోగులకు అదనపు బాధ్యతల వలన శిరోభాధలు తప్పవు. వృత్తి వ్యాపారాలలో కష్టానికి తగిన ఫలితం కనిపించదు. సంతాన విద్యా విషయాలపై దృష్టి సారించడం మంచిది.

మిధునం: చిన్ననాటి మిత్రులతో విందు వినోద కార్యక్రమాలలో పాల్గొంటారు. జీవిత భాగస్వామితో ఆలయాలు దర్శిస్తారు. ఆకస్మిక ధన లాభ సూచనలున్నవి. కుటుంబ వ్యవహారాలలో ఆలోచనలు కార్యరూపం దాలుస్తాయి. నూతన వ్యాపారాలు ప్రారంభించి లాభాలు అందుకుంటారు. ఉద్యోగస్తులు పని ఒత్తిడి నుండి బయటపడతారు.

కర్కాటకం: ఒక కీలక వ్యవహారంలో బంధువులతో విభేదాలు కలుగుతాయి. వృత్తి వ్యాపారాలలో సరైన నిర్ణయాలు తీసుకోలేక నష్టాలు ఎదుర్కొంటారు. పాత ఋణాలు తీర్చడానికి నూతన ఋణాలు చేస్తారు. ఉద్యోగమున అధికారులతో ఆలోచించి మాట్లాడాలి. దూరప్రయాణాలలో మార్గ అవరోధాలు కలుగుతాయి.

సింహం: సోదరులతో స్థిరాస్తి వివాదాలు పరిష్కరించుకుంటారు. నిరుద్యోగులకు నూతన ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి. కుటుంబ సభ్యులతో గృహమున ఆనందంగా గడుపుతారు. ఉద్యోగస్తులకు హోదాలు పెరుగుతాయి. వృత్తి వ్యాపారాలలో కీలక సమయంలో నిర్ణయాలు తీసుకుని లాభాలు అందుకుంటారు. ఆర్థిక పురోగతి సాధిస్తారు.

కన్య: చేపట్టిన కార్యక్రమాలలో అవరోధాలు కలుగుతాయి. చిన్ననాటి మిత్రులతో ఊహించని వివాదాలు కలుగుతాయి. నేత్ర సంబంధిత అనారోగ్య సమస్యలు బాధిస్తాయి. దూర ప్రయాణాలు వాయిదా వేయుట మంచిది. వృత్తి వ్యాపారాలు మందగిస్తాయి. ఉద్యోగస్తులకు నూతన బాధ్యతలు వలన తగిన విశ్రాంతి ఉండదు.

తుల: చిన్ననాటి మిత్రులను కలుసుకుని పాత విషయాలు చర్చిస్తారు. కుటుంబ సభ్యులతో దైవ సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. అన్ని వైపుల నుండి ఆదాయం అందుతుంది. చాలాకాలంగా పూర్తి కాని పనులు సకాలంలో పూర్తి చేస్తారు. వ్యాపారమున నూతన లాభాలు అందుతాయి. నిరుద్యోగుల కలలు సాకారమౌతాయి.

వృశ్చికం: నూతన వ్యాపారాలకు పెట్టుబడులు అందుతాయి. విద్యార్థులు పోటీ పరీక్షలలో అనుకూల ఫలితాలు పొందుతారు. నూతన వాహన యోగం ఉన్నది. వృత్తి ఉద్యోగాలలో మరింత అనుకూలత కలుగుతుంది. బంధు మిత్రులతో శుభకార్యాలకు హాజరవుతారు. ధన వ్యవహారాలు ఆశించిన విధంగా సాగుతాయి.

ధనస్సు: దూరప్రయాణ సూచనలు ఉన్నవి. బంధుమిత్రులతో ఊహించని వివాదాలు కలుగుతాయి. వృత్తి వ్యాపారాలలో తొందరపాటు నిర్ణయాలు చెయ్యడం మంచిది కాదు. ఆరోగ్య సమస్యలు మానసికంగా భాదిస్తాయి. చేపట్టిన పనులు ముందుకు సాగవు. ఉద్యోగస్తులు అధికారులతో ఆలోచించి మాట్లాడటం మంచిది.

మకరం: ఉద్యోగస్తులకు స్థానచలన సూచనలు ఉన్నవి. ఆధ్యాత్మిక చింతన పెరుగుతుంది. దూర ప్రయాణాలు వాయిదా పడతాయి. వృధా ఖర్చులు పెరుగుతాయి. కుటుంబ వాతావరణం సమస్యాత్మకంగా ఉంటుంది. వృత్తి వ్యాపారాల్లో కష్టం వృధాగా మిగులుతుంది. ఋణదాతల నుండి ఒత్తిడి అధికమవుతుంది.

కుంభం: భూ సంబంధిత క్రయ విక్రయాలలో నూతన లాభాలు అందుకుంటారు. ఉద్యోగ వ్యాపారాలలో ఆశించిన పురోగతి సాధిస్తారు. సన్నిహితుల నుండి కీలక సమాచారం అందుతుంది. చేపట్టిన పనులలో కార్యసిద్ధి కలుగుతుంది. విలువైన వస్తు వాహనాలు కొనుగోలు చేస్తారు. ఆర్థిక స్థిరత్వం కలుగుతుంది.

మీనం: కుటుంబ సభ్యులతో దైవ సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. సమాజంలో ప్రముఖుల నుండి అరుదైన ఆహ్వానాలు అందుతాయి. నిరుద్యోగ ప్రయత్నాలు వేగవంతం చేస్తారు. సోదరుల నుండి ఆశించిన సహాయం అందుతుంది. వ్యాపార ఉద్యోగాలలో అధికారులతో ఉన్న సమస్యలు పరిష్కార దిశగా సాగుతాయి.

# వెనెజువెలా.. విలవిల



మొదటి పేజీ తరువాయి

విమానాశ్రయానికి కూడా నష్టం వాటిల్లడంతో విమాన రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. మెట్రో సేవలను నిలిపివేయగా, పాఠశాలలకు సెలవులు ప్రకటించారు. అమెరికా భూకంప పరిశోధనా సంస్థ తెలిపిన వివరాల ప్రకారం మొదటి భూకంపం కారకాస్‌కు పశ్చిమాన ఉన్న మోరాన్ సమీపంలో సంభవించగా, కేవలం నిమిషం వ్యవధిలోనే మరో భారీ భూకంపం నమోదైంది. ఈ ప్రకంపనలు బ్రెజిల్, కొలంబియా వరకు అనిపించాయి. విపత్తు తీవ్రత దృష్ట్యా అమెరికా, మెక్సికో, ఖతార్, ఎల్‌సాల్వడార్ సహా పలు దేశాలు సహాయక బృందాలు, వైద్య సాయం పంపుతున్నాయి. ప్రభుత్వం అత్యవసర పరిస్థితిని ప్రకటించి సహాయక చర్యలను ముమ్మరం చేసింది.

### అండగా ఉంటాం: మోదీ

వెనెజువెలా భూకంపాల విధ్వంసంపై భారత ప్రధానమంత్రి మోదీ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఎక్స్ వేదికగా మోదీ స్పందిస్తూ... విపత్తు బాధితులకు, వెనెజువెలా ప్రభుత్వానికి భారతదేశం తరపున ప్రగాఢ సానుభూతిని ప్రకటించారు. ఈ కష్టకాలంలో వెనెజువెలాకు అవసరమైన అన్ని రకాల మానవీయ, వైద్య సహాయసహకారాలను అందించేందుకు భారతదేశం సిద్ధంగా ఉందని మోదీ స్పష్టం చేశారు.

## 'పంచముఖ సంకటహర మహాగణపతి'గా ఖైరతాబాద్ గణేశ్

మొదటి పేజీ తరువాయి

ఖైరతాబాద్ గణేశుడిని పంచముఖ సంకటహార మహాగణపతి రూపంలో ఏర్పాటు చేస్తున్నట్లు ఉత్సవ కమిటీ ప్రతినిధులు తేల్చి చెప్పారు. ఈ భారీ వినాయకుడి విగ్రహానికి కుడివైపున ద్వాదశ జ్యోతిర్లింగాల్లో ఒకటైన సోమనాథ్ జ్యోతిర్లింగం రూపాన్ని ఏర్పాటు చేయనున్నారు. అదే సమయంలో ఎడమ వైపున భక్తులను ఎల్లవేళలా కాపాడే కాళికామాత విగ్రహాన్ని అద్భుతంగా తీర్చిదిద్దనున్నట్లు ఉత్సవ కమిటీ స్పష్టం చేసింది. లోక కల్యాణార్థం కొలువుదీరనున్న ఈ పంచముఖ గణపతి విశేష రూపం ఇప్పుడు భక్తులను విశేషంగా ఆకట్టుకోనుంది.

## నేటి నుంచి ఈపీఎఫ్ఓ సేవలు బంద్!

మొదటి పేజీ తరువాయి

సేవలు అందించడమే దీని ఉద్దేశమని ఈపీఎఫ్‌వో తెలిపింది. సేవలు జూన్ 30 నుంచి తిరిగి ప్రారంభమయ్యే అవకాశం ఉందని వెల్లడించింది. అయితే ఉమంగ్ యాప్‌లో కనిపిస్తున్న సమాచారం ప్రకారం కొన్ని సేవలు జులై 2 వరకు అందుబాటులోకి వచ్చే అవకాశం లేదు. ఈ నేపథ్యంలో సభ్యులు, యజమానులు తమ అవసరాలను ముందుగానే పూర్తి చేసుకోవాలని సూచించింది. ఏవైనా ఇబ్బందులు ఎదురైతే ఈపీఎఫ్‌వో హెల్ప్‌లైన్ 14470ను సంప్రదించాలని సంస్థ సూచించింది.

## ఫీ'జులుం' తప్పేం కాదు!?

మొదటి పేజీ తరువాయి

రీయిబర్స్‌మెంట్ బకాయిలను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయకపోవడంతోపాటు.. విద్యార్థుల నుంచి ఫీజులు వసూలు చేయవద్దంటూ సర్కార్ తీసుకొచ్చిన జీవో 9పై ధర్మాసనం తీవ్రంగా మండిపడింది. వచ్చే మంగళవారం వరకు ఎలాంటి చర్యలు తీసుకోవద్దని స్టే విధిస్తూ హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. జీవో నంబర్ 9ని సవాల్ చేస్తూ ప్రైవేటు కాలేజీలు దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన తెలంగాణ హైకోర్టు .. రాష్ట్ర ప్రభుత్వానికి పలు ప్రశ్నలు సంధించింది. ప్రభుత్వం బకాయిలు చెల్లించకుండా.. విద్యార్థుల నుంచి ఫీజులు వసూలు చేయవద్దంటే యాజమాన్యాలు ప్రైవేటు కాలేజీలను ఎలా నడుపుతారని నిలదీసింది. అదే సమయంలో రాష్ట్రంలో విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం ఎంత బడ్జెట్ కేటాయించారని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ప్రశ్నించింది. బడ్జెట్ సమావేశాలు కూడా అయిపోయాయని.. ఇంకా పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను ఎందుకు విడుదల చేయలేదని రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని హైకోర్టు ప్రశ్నించింది. రాష్ట్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన రూ.కోట్ల ఫీజు రీయంబర్స్‌మెంట్ బకాయిలు ఆగిపోవడంతో కాలేజీలను నడపడం కష్టంగా మారిందని.. ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బందికి వేతనాలు చెల్లించడం కూడా కాలేజీలకు భారంగా మారిందని హైకోర్టు పేర్కొంది. ఈ క్రమంలోనే ప్రైవేటు కాలేజీలకు ఫీజు రీయంబర్స్‌మెంట్ కింద చెల్లించాల్సిన పెండింగ్ బకాయిలను ఎప్పటి లోగా చెల్లిస్తారో చెప్పారని హైకోర్టు ఆదేశించింది. ఈ ఏడాది ఆగస్ట్ 15వ తేదీ లోపు అన్ని బకాయిలను క్లియర్ చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం తరఫు వాదనలు వినిపించిన లాయర్ హైకోర్టుకు తెలిపారు. దీనిపై స్పందించిన ప్రైవేటు కాలేజీల తరఫు వాదనలు వినిపిస్తున్న లాయర్.. ఆగస్టు 15వ తేదీ లోపు బకాయిలు మొత్తం క్లియర్ చేస్తే.. ఆరోజే తాము దాఖలు చేసిన పిటిషన్లను వెనక్కి తీసుకుంటామని హైకోర్టుకు విన్నవించారు. ఇక ఈ వ్యవహారంలో పలువురు విద్యార్థులు కూడా ఇంప్లీడ్ పిటిషన్లు దాఖలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వానికి, ప్రైవేటు కాలేజీల యాజమాన్యాలకు మధ్య విద్యార్థులు తీవ్రంగా నలిగిపోతున్నారని విద్యార్థుల తరఫు న్యాయవాది హైకోర్టుకు తెలిపారు. ఈ పెండింగ్ బకాయిల ద్వారా విద్యార్థులు నష్టపోకుండా చూడాలని కోర్టును కోరారు. ఈ ఏడాది కొత్తగా కాలేజీల్లో చేరే విద్యార్థులకే ఇది వర్తించేలా చూడాలని.. విజ్ఞప్తి చేశారు. ఈ పిటిషన్లపై తదుపరి విచారణను హైకోర్టు మంగళవారానికి(జూన్ 30) వాయిదా వేసింది.

## 9వ తరగతిలో 'ఎమర్జెన్సీ' పాఠం

మొదటి పేజీ తరువాయి

వ్యవస్థ ఎదుర్కొన్న అతిపెద్ద సవాళ్లలో ఎమర్జెన్సీ ఒకటిగా ఈ పాఠంలో వివరించారు. నూతన జాతీయ విద్యా విధానంలో భాగంగా ఎన్‌సీఈఆర్‌టీ తన పాఠ్యప్రణాళికను సవరించింది. ఇందులో భాగంగా, 9వ తరగతి విద్యార్థుల కోసం రూపొందించిన "అండర్‌స్టాండింగ్ సొసైటీ: ఇండియా అండ్ బియాండ్" పుస్తకంలో ఎమర్జెన్సీపై ప్రత్యేక విభాగాన్ని పొందుపరిచారు. ఆ కాలంలో ప్రాథమిక హక్కుల రద్దు, పత్రికా స్వేచ్ఛపై ఆంక్షలు, రాజకీయ ప్రత్యర్థుల అరెస్టులు వంటి అంశాలను ఈ పాఠ్యాంశంలో కూలంకషంగా వివరించారు. ఎన్‌సీఈఆర్‌టీ తీసుకున్న ఈ నిర్ణయాన్ని కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ స్వాగతించారు. ఎమర్జెన్సీ వంటి చీకటి రోజులు పునరావృతం కాకుండా ఉండాలంటే, ఆనాటి చారిత్రక పరిణామాల గురించి భావి తరాలకు తెలియజేయడం అనివార్యమని ఆయన అభిప్రాయపడ్డారు. మరోవైపు, బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి షెహజాద్ పూనావాలా మాట్లాడుతూ, రాజ్యాంగ చరిత్రలో ఎమర్జెన్సీ ఒక చీకటి అధ్యాయమని, కాంగ్రెస్ పార్టీ ఇప్పటికీ అదే ధోరణిని ప్రదర్శిస్తోందని విమర్శించారు. అయితే, సిలబస్‌లో చోటుచేసుకున్న ఈ మార్పులను విపక్షాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. ప్రభుత్వం చరిత్రను తమకు అనుకూలంగా వక్రీకరిస్తోందని ఆరోపిస్తున్నాయి.

# భారత్‌లో 4.53 లక్షల కోట్ల పెట్టుబడి

మొదటి పేజీ తరువాయి

విస్తరించడానికి 2030 నాటికి అదనంగా 13 బిలియన్ డాలర్లు పెట్టుబడిగా పెట్టనున్నట్లు ఆండీ జెస్సీ తెలిపారు. దీంతో కేవలం ఏఐ, క్లౌడ్ రంగంలోనే అమెజాన్ మొత్తం పెట్టుబడి 21 బిలియన్ డాలర్లను దాటనుంది. ఈ పెట్టుబడుల ద్వారా ముంబై, హైదరాబాద్‌లలోని అమెజాన్ వెబ్ సర్వీసెస్ (ఏడబ్ల్యూఎస్) డేటా సెంటర్ల సామర్థ్యాన్ని గణనీయంగా పెంచనున్నారు. ఇది స్టార్టప్‌లు, వ్యాపార సంస్థలు, ప్రభుత్వ ఏజెన్సీలకు కస్టమ్ ఏఐ చిప్స్, సురక్షిత క్లౌడ్ టెక్నాలజీలు, డెవలపర్ టూల్స్‌ను అందుబాటులోకి తెస్తుంది. తద్వారా ఆవిష్కరణలను వేగవంతం చేయవచ్చని కంపెనీ పేర్కొంది. ఈ సమావేశం అనంతరం ఆండీ జెస్సీ మాట్లాడుతూ.. "దశాబ్దం క్రితం భారత్‌లోకి అడుగుపెట్టాం. అప్పటి నుంచి ఈ-కామర్స్, ఏఐ, క్లౌడ్ వ్యాపారాల్లో అద్భుతమైన వృద్ధిని చూస్తున్నాం. ప్రధాని మోదీ దార్శనికత అయిన 'వికసిత్ భారత్', 'ఆత్మనిర్భర్ భారత్' లక్ష్యాల సాధనకు కట్టుబడి ఉన్నాం. భారత్ వృద్ధి ప్రస్థానంలో దీర్ఘకాలిక భాగస్వామిగా కొనసాగుతాం" అని స్పష్టం చేశారు. ఈ కొత్త పెట్టుబడులతో కలిపి 2010 నుంచి 2030 వరకు భారత్‌లో అమెజాన్ పెట్టిన మొత్తం పెట్టుబడుల విలువ 88 బిలియన్ డాలర్లకు పైగా చేరుకుంటుంది. గత కొన్నేళ్లుగా భారత్‌లో 12 మిలియన్ల చిన్న వ్యాపారాలను డిజిటలైజ్ చేశామని, 20 బిలియన్ డాలర్ల విలువైన ఈ-కామర్స్ ఎగుమతులను సాధ్యం చేశామని, ప్రత్యక్షంగా, పరోక్షంగా 2.8 మిలియన్ల ఉద్యోగాలకు మద్దతు ఇచ్చామని కంపెనీ వివరించింది. అలాగే, 10 మిలియన్ల భారతీయులకు క్లౌడ్ స్కిల్స్‌పై శిక్షణ ఇచ్చినట్లు తెలిపింది. భవిష్యత్తులోనూ భారత ప్రభుత్వ ప్రాధాన్యతలకు అనుగుణంగా ఏఐ ఆధారిత డిజిటలైజేషన్, ఎగుమతుల వృద్ధి, ఉద్యోగాల కల్పనపై దృష్టి సారిస్తామని అమెజాన్ పేర్కొంది. రానున్న కాలంలో 3.8 మిలియన్ల ఉద్యోగాలకు మద్దతు ఇవ్వడం, 80 బిలియన్ డాలర్ల సంచిత ఎగుమతులు సాధించడం, 15 మిలియన్ల చిన్న వ్యాపారాలకు ఏఐ ప్రయోజనాలు అందించడం, 4 మిలియన్ల ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఏఐ విద్యను అందించడం వంటి లక్ష్యాలను నిర్దేశించుకున్నట్లు వెల్లడించింది.

# యస్.. గుంపు మేస్త్రీనే!

మొదటి పేజీ తరువాయి

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. ఈ మేరకు 14 బ్యాంకులతో ప్రభుత్వం అవగాహన ఒప్పందాలు కుదుర్చుకుంది. రవీంద్రభారతిలో జరిగిన కార్యక్రమంలో సీఎం స్వయంగా ఒప్పందాలపై సంతకాలు చేసి పథకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడిన సీఎం, ప్రభుత్వం కోసం కష్టపడే ఉద్యోగుల భద్రతను కాపాడటం తమ బాధ్యత అని చెప్పారు. ఉద్యోగులు అడగక ముందే ప్రభుత్వం ముందడుగు వేసి ఈ నిర్ణయం తీసుకుందని పేర్కొన్నారు. పదవీ విరమణ తర్వాత కూడా బీమా ప్రయోజనాలు కొనసాగించేలా చర్యలు తీసుకున్నామని వెల్లడించారు. ప్రమాద బీమా కింద ఉద్యోగులకు రూ.1 కోటి నుంచి రూ.1.5 కోట్ల వరకు కవరేజీ లభిస్తుందని తెలిపారు. విమాన ప్రమాదాల సందర్భంలో బ్యాంకులు రూ.2 కోట్ల నుంచి రూ.3 కోట్ల వరకు బీమా రక్షణ అందిస్తాయని వివరించారు. రాష్ట్ర అభివృద్ధి కోసం కృషి చేస్తున్న ఉద్యోగులందరికీ సీఎం కృతజ్ఞతలు తెలిపారు. ఉద్యోగుల సంక్షేమంపై ప్రభుత్వం కట్టుబడి ఉందని రేవంత్ స్పష్టం చేశారు. పీఆర్సీ విషయంలో ఇచ్చిన హామీని కూడా తప్పకుండా అమలు చేస్తామని చెప్పారు. ఉద్యోగుల నమ్మకమే ప్రభుత్వానికి బలమని, ప్రభుత్వాలు మారినా ఉద్యోగ వ్యవస్థ శాశ్వతమని పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో జీతాలు చెల్లించలేని పరిస్థితి ఉండేదని విమర్శించిన సీఎం విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రతి నెలా తొలి రోజే జీతాలు చెల్లిస్తున్నామని చెప్పారు. రాష్ట్ర ఆదాయం పెరిగేలా ఉద్యోగులు ప్రతిరోజూ అదనంగా గంట పనిచేయాలని కోరారు. వచ్చే అదనపు ఆదాయాన్ని ఉద్యోగుల సంక్షేమానికే వినియోగిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం రాజకీయ అంశాలపైనా స్పందించిన సీఎం తాను "గుంపు మేస్త్రీ"నని, రాష్ట్ర అభివృద్ధి కోసం పనిచేసే తన బృందానికి నాయకత్వం వహిస్తున్నానని అన్నారు. మూసీ నది ప్రక్షాళన, మెట్రో విస్తరణ వంటి అభివృద్ధి కార్యక్రమాలకు ప్రతిపక్షాలు అడ్డంకులు సృష్టిస్తున్నాయని ఆరోపించారు.

### 3 రాష్ట్రాల రైతులకు కొత్త ఆశ: రేవంత్

తుంగభద్ర డ్యామ్ క్రస్ట్ గేట్ల పునరుద్ధరణ దక్షిణ భారత జలవనరుల చరిత్రలో చిరస్మరణీయ ఘట్టంగా నిలుస్తుందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. కర్ణాటకలోని మునీరాబాద్‌లో నూతన క్రస్ట్ గేట్ల ప్రారంభోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన ఈ ప్రాజెక్టు మూడు రాష్ట్రాల రైతాంగ భవిష్యత్తుకు కొత్త ఆశలు నింపుతోందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన సీఎం గేట్ల పునరుద్ధరణను కేవలం ఇంజినీరింగ్ విజయంగా చూడలేమన్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల్లోని కరవు ప్రభావిత ప్రాంతాలకు ఇది కీలక మైలురాయిగా మారుతుందని చెప్పారు. ముఖ్యంగా రాయలసీమ జిల్లాలైన కర్నూలు, అనంతపురంతో పాటు తెలంగాణలోని పాలమూరు ప్రాంత ప్రజలు ఎదుర్కొన్న నీటి కష్టాలు తనకు బాగా తెలుసన్నారు. రాష్ట్రాల మధ్య నీటి పంపకాల అంశాలు సకాలంలో పరిష్కారం కాకపోవడం వల్ల విలువైన జలాలు సముద్రంలో కలిసిపోతున్నాయని రేవంత్ ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయాలు, వివాదాలు పక్కనబెట్టి రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ముందుకు సాగాల్సిన అవసరం ఉందన్నారు. తుంగభద్ర వేదికగా మూడు రాష్ట్రాల మధ్య జరుగుతున్న చర్చలు సానుకూల దిశగా సాగుతున్నాయని సీఎం తెలిపారు. ఇదే స్ఫూర్తితో కృష్ణా, గోదావరి నదీ జలాల పంపకాల సమస్యలకు కూడా శాశ్వత పరిష్కారం లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తెలంగాణకు సంబంధించిన కీలక అంశాన్ని కూడా సీఎం ప్రస్తావించారు. తుంగభద్ర ప్రాజెక్టు నుంచి చట్టబద్ధంగా రావాల్సిన 10 టీఎంసీల నీరు ఇప్పటికీ రాష్ట్రానికి పూర్తిగా అందడం లేదని పేర్కొన్నారు. రాజోలిబండ డైవర్షన్ స్కీమ్ (ఆర్డీఎస్) పరిధిలోని తెలంగాణ రైతులకు న్యాయం జరగాల్సిన అవసరం ఉందన్నారు. ఈ విషయంలో పొరుగు రాష్ట్రాలు సహకార భావంతో వ్యవహరించాలని కోరిన సీఎం, పరస్పర అవగాహనతో ముందుకు సాగితేనే మూడు రాష్ట్రాల రైతాంగానికి దీర్ఘకాలిక ప్రయోజనం చేకూరుతుందని స్పష్టం చేశారు.

## రియల్ ఎస్టేట్‌ను బొందవెట్టిండు!

మొదటి పేజీ తరువాయి

అధికారంలోకి వచ్చిన తర్వాత అదే రంగాన్ని పూర్తిగా దెబ్బతీశారని విమర్శించారు. చేవెళ్ల నియోజకవర్గంలో నిర్వహించిన పార్టీ కార్యకర్తల సమావేశం, ఎస్‌ఐఆర్ శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. ఎన్నికలకు ముందు రూ.కోటి పలికిన ఎకరం భూమి ప్రస్తుతం రూ.50-60 లక్షలకు కూడా కొనుగోలుదారులు దొరకని పరిస్థితి ఏర్పడిందన్నారు. రియల్ ఎస్టేట్‌పై ఆధారపడి జీవిస్తున్న లక్షలాది మంది ఉపాధి కోల్పోయే పరిస్థితి వచ్చిందని ఆరోపించారు. కేసీఆర్ హయాంలో చేవెళ్ల ప్రాంత అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం ఇచ్చామని కేటీఆర్ చెప్పారు. షాబాద్ పరిసర ప్రాంతాల్లో పారిశ్రామిక పార్కులు ఏర్పాటు చేసి మైక్రోసాఫ్ట్, అమెజాన్, వెల్స్‌పన్ వంటి అంతర్జాతీయ సంస్థలను తీసుకొచ్చామని చెప్పారు. పరిశ్రమల విస్తరణతో ఒకప్పుడు రూ.30 లక్షలు ఉన్న ఎకరం భూమి విలువ రూ.3 కోట్లకు చేరిందన్నారు. ఇప్పుడు ఆ పరిస్థితి పూర్తిగా మారిపోయిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు గడిచినా ఎన్నికల హామీల్లో ఒక్కటి కూడా పూర్తిగా అమలు కాలేదని కేటీఆర్ విమర్శించారు. రైతు బంధు, దళిత బంధు, ఇందిరమ్మ ఇళ్లు, అసైన్డ్ భూముల పట్టాల అంశాల్లో ప్రజలను మోసం చేశారని ఆరోపించారు. రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. రాష్ట్రంలో అవినీతి, అక్రమాలు పెరిగిపోయాయని కేటీఆర్ ఆరోపించారు. గత ప్రభుత్వ అప్పులపై విమర్శలు చేసే కాంగ్రెస్ నేతలు తమ పాలనలో చేసిన అప్పుల లెక్కలు ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అప్పులు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల కోసమే ఖర్చయ్యాయని చెప్పారు. తెలంగాణ అభివృద్ధి, సంక్షేమం కొనసాగాలంటే 2028లో కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి కావాల్సిన అవసరం ఉందని కేటీఆర్ అన్నారు. పార్టీ సభ్యత్వ నమోదు, ఎస్‌ఐఆర్ కార్యక్రమాలను విజయవంతం చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు.

## పాస్‌పోర్టు ధరలు భారీగా పెంపు

మొదటి పేజీ తరువాయి

పాస్‌పోర్ట్‌కు రూ.6,000 చెల్లించాల్సి ఉంటుంది. ఇక 18 ఏళ్లలోపు మైనర్లకు 36 పేజీల పాస్‌పోర్ట్ ఫీజును రూ.1,750గా నిర్ణయించారు. పాస్‌పోర్ట్ పోగొట్టుకున్నా లేదా పాడైపోయినా తిరిగి పొందేందుకు అయ్యే రీప్లేస్‌మెంట్ ఖర్చులను కూడా గణనీయంగా పెంచారు. సాధారణ విధానంలో 36 పేజీల పాస్‌పోర్ట్ రీప్లేస్‌మెంట్‌కు రూ.5,000, 60 పేజీల పాస్‌పోర్ట్‌కు రూ.6,000 చెల్లించాలి. వీటినే తత్కాల్ విధానంలో పొందాలంటే వరుసగా రూ.7,500, రూ.8,500 ఖర్చవుతుంది. కాగా, పోలీస్ క్లియరెన్స్ సర్టిఫికెట్ (పీసీసీ) ఫీజును రూ.750గా ఖరారు చేశారు. ప్రస్తుతం పాస్‌పోర్ట్ సేవా పోర్టల్‌లో పాత రుసుములే కనిపిస్తున్నప్పటికీ, జూలై 1 నుంచి కొత్త ధరలు వర్తిస్తాయి. అయితే పాస్‌పోర్ట్ కాలపరిమితిలో ఎలాంటి మార్పులు లేవని అధికారులు స్పష్టం చేశారు. పెద్దలకు 10 ఏళ్లు, మైనర్లకు 5 ఏళ్ల పాటు పాస్‌పోర్ట్ చెల్లుబాటు కానుంది.

## రూ.7,500 పెరిగిన మారుతి డిజైర్

ముంబై: దేశంలో అత్యధికంగా అమ్ముడవుతున్న సెడాన్ కార్లలో ఒకటైన మారుతీ సుజుకీ డిజైర్ ధరలను కంపెనీ పెంచింది. కొన్ని వేరియంట్లపై రూ.7,500 వరకు పెంచినట్లు ప్రకటించింది. అయితే బేస్ మోడల్ ఎల్ఎక్స్ఐ ధరలో ఎలాంటి మార్పు లేదు. కొత్త ధరల ప్రకారం వీఎక్స్ఐ సీఎన్‌జీ, జెడ్ ఎక్స్ఐ సీఎన్‌జీ వేరియంట్లపై అత్యధికంగా రూ.7,500 పెంపు అమలు కానుంది. దీంతో వాటి ఎక్స్‌షోరూమ్ ధరలు వరుసగా రూ.8.10 లక్షలు, రూ.9.11 లక్షలకు చేరాయి. పెట్రోల్ వేరియంట్లపై మాత్రం రూ.5,000 చొప్పున పెరిగాయి. కొత్త ధరల ప్రకారం.. ఎల్ఎక్స్ఐ రూ.6.25 లక్షలు, వీఎక్స్ఐ రూ.7.22 లక్షలు, జెడ్ఎక్స్ఐ రూ.8.22 లక్షలు, జెడ్ ఎక్స్ఐ ప్లస్ రూ.8.91 లక్షలు ఉండనుంది.

## మ్యాక్‌బుక్, ఐప్యాడ్ ధరల పెంపు

ప్రముఖ టెక్ దిగ్గజం యాపిల్ తన వినియోగదారులకు భారీ షాక్ ఇచ్చింది. భారత్‌లో మ్యాక్‌బుక్, ఐప్యాడ్ ఉత్పత్తుల ధరలను భారీగా పెంచింది. కొన్ని ఎంపిక చేసిన మోడళ్లపై ఏకంగా లక్ష రూపాయల వరకు ధర పెరగడం గమనార్హం. సవరించిన ఈ కొత్త ధరలు కంపెనీ అధికారిక వెబ్‌సైట్‌లో గురువారం నుంచి అమల్లోకి వచ్చాయి. ప్రపంచ వ్యాప్తంగా కృత్రిమ మేధ (ఏఐ) కోసం పెరుగుతున్న డిమాండ్‌తో మెమొరీ, స్టోరేజ్ చిప్‌ల ధరలు అమాంతం పెరిగాయి. ఈ భారాన్ని ఇకపై భరించలేమని, అందుకే ధరలు పెంచాల్సి వస్తోందని యాపిల్ సీఈఓ టిమ్ కుక్ కొద్దిరోజుల క్రితమే సంకేతాలిచ్చారు. తాజా పెంపుతో మ్యాక్‌బుక్ ప్రో 14-అంగుళాల (ఎం5 మాక్స్ వేరియంట్) ధరపై ఏకంగా రూ. 1,00,000 పెరిగింది. బేస్ మ్యాక్‌బుక్ ప్రో 14 అంగుళాల మోడల్‌పై రూ. 70,000, మ్యాక్‌బుక్ ఎయిర్ 13 అంగుళాలపై రూ.30,000, ఐప్యాడ్ ఎయిర్ 11 అంగుళాల మోడల్‌పై రూ. 25,000 మేర ధరలు పెరిగాయి. "విడిభాగాల ధరలు ఇంత వేగంగా, ఈ స్థాయిలో పెరగడం ఎప్పుడూ చూడలేదు. ఇప్పటివరకు వినియోగదారులపై భారం పడకుండా జాగ్రత్త వహించాం, కానీ ప్రస్తుత పరిస్థితుల్లో ధరల పెంపు అనివార్యమైంది" అని యాపిల్ సంస్థ వెల్లడించింది.

# డ్రైవరే ఏటీఎం క్యాష్ దొంగ

**రెండ్రోజుల్లోనే నిందితులను పట్టుకున్న పోలీసులు**

**వ్యాన్ డ్రైవర్ శ్రీనివాస్, ఇద్దరు కుమారులు అరెస్ట్**

**నిందితుల నుంచి రూ. 14.5 లక్షల నగదు స్వాధీనం**

హైదరాబాద్, జూన్ 25 (ఈవార్తలు): హైదరాబాద్ నగరంలో సంచలనం సృష్టించిన ఏటీఎం క్యాష్ వ్యాన్ చోరీ కేసును పోలీసులు కేవలం రెండు రోజుల్లోనే ఛేదించారు. నిందితుడైన వ్యాన్ డ్రైవర్ శ్రీనివాస్‌తో పాటు అతని ఇద్దరు కుమారులను అరెస్ట్ చేసిన పోలీసులు, వారి నుంచి రూ. 14.5 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. ఐఎస్ సదన్ పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం ఈ ఘటన చోటుచేసుకుంది. క్లియర్డ్ సెక్యూరిటీ సర్వీసెస్ సంస్థకు చెందిన క్యాష్ వ్యాన్‌లో డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్న శ్రీనివాస్, మరో ఇద్దరు సిబ్బంది మరియు గన్‌మెన్‌తో కలిసి ఏటీఎంలలో నగదు నింపేందుకు వెళ్లాడు. ఐఎస్ సదన్‌లోని ఎస్‌బీఐ ఏటీఎం వద్ద సిబ్బంది నగదు జమ చేసేందుకు లోపలికి వెళ్లగా, వ్యాన్‌లో ఒంటరిగా ఉన్న శ్రీనివాస్ రూ. 17 లక్షల నగదు ఉన్న బ్యాగ్‌తో పరారయ్యాడు. ఈ చోరీ కోసం శ్రీనివాస్ పక్కా ప్రణాళిక రచించినట్లు పోలీసులు వెల్లడించారు. శ్రీనివాస్ వ్యాన్ నడుపుతుండగా, అతని పెద్ద కుమారుడు బైక్‌పై వెన్నంటి వచ్చాడు. నగదు బ్యాగ్‌తో వ్యాన్ దిగిన శ్రీనివాస్, తన కుమారుడితో కలిసి అక్కడి నుంచి ఉడాయించాడు. అనంతరం ఉప్పుగూడలో చిన్న కుమారుడిని కలిసి కొంత నగదు అందజేసి, ఓ క్యాబ్ ద్వారా శంషాబాద్ ఔటర్ రింగ్ రోడ్డు వైపు వెళ్లినట్లు దర్యాప్తులో వెల్లడైంది. సెక్యూరిటీ ఏజెన్సీ సిబ్బంది ఫిర్యాదుతో రంగంలోకి దిగిన పోలీసులు ఐదు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. సీసీటీవీ ఫుటేజీని విశ్లేషించి నిందితుల కదలికలను గుర్తించిన పోలీసులు, అత్యంత వేగంగా దర్యాప్తు పూర్తి చేసి తండ్రీకొడుకులను అదుపులోకి తీసుకున్నారు.

# మీవాళ్లకే ఇలా జరిగితే?

**బాధితుల పట్ల అమర్యాదగా ఉండొద్దు**

**ఖాకీలకు హైదరాబాద్ సీపీ సజ్జనార్ వార్నింగ్**

హైదరాబాద్, జూన్ 25 (ఈవార్తలు): హైదరాబాద్ పోలీస్ స్టేషన్లకు వచ్చే బాధితుల పట్ల కొందరు సిబ్బంది వ్యవహరిస్తున్న తీరుపై నగర పోలీస్ కమిషనర్ సజ్జనార్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫిర్యాదు చేసేందుకు వచ్చే ప్రజలతో అమర్యాదగా, బాధ్యతారహితంగా ప్రవర్తిస్తున్న సిబ్బందిపై కఠినమైన శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన ఉన్నతాధికారులను ఆదేశించారు. బంజారాహిల్స్‌లోని పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ఇటీవల నిర్వహించిన ఉన్నత స్థాయి నేర సమీక్షా సమావేశంలో ఆయన ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. "కష్టాల్లో ఉండి, మానసిక వేదనతో ఆసరా కోసం పోలీస్ స్టేషన్ గడప తొక్కే ప్రజలతో వ్యవహరించాల్సిన పద్ధతి ఇదేనా?" అంటూ అధికారులను సజ్జనార్ నిలదీశారు. కొన్ని స్టేషన్లలో రిసెప్షనిస్టులు, పరిపాలనా బాధ్యతలు చూసే అడ్మిన్ ఎస్సైల ప్రవర్తన సరిగా లేదని, సమయపాలన కూడా పాటించడం లేదని ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. పర్యవేక్షణ లోపించినందుకు కొందరు ఇన్‌స్పెక్టర్లకు ఇప్పటికే ఛార్జిమెమోలు జారీ చేసినట్లు పోలీసు వర్గాల ద్వారా తెలిసింది. ప్రజల నుంచి వస్తున్న ఫిర్యాదుల నేపథ్యంలో, క్షేత్రస్థాయిలో వాస్తవాలను నిగ్గు తేల్చేందుకు సీపీ సజ్జనార్ ఒక వినూత్న వ్యూహాన్ని అమలు చేశారు. ఆయన స్వయంగా డెకాయ్ ఆపరేషన్లు నిర్వహించారు. కొందరు పోలీసు అధికారులనే సాధారణ పౌరులుగా, సివిల్ డ్రెస్‌లో ఫిర్యాదులు చేసేందుకు నగరంలోని వివిధ పోలీస్ స్టేషన్లకు పంపించారు. అక్కడ సిబ్బంది స్పందించిన తీరు, వారికి ఎదురైన అనుభవాలపై నివేదిక తెప్పించుకున్నారు. ఈ రహస్య ఆపరేషన్‌లో దాదాపు 12 పోలీస్ స్టేషన్లలో సిబ్బంది తీరు దారుణంగా ఉన్నట్లు వెల్లడైంది. ఫిర్యాదు చేయడానికి వెళ్లిన వారితో రిసెప్షనిస్టులు, ఏఎస్సైలు కఠినంగా మాట్లాడటం, అది తమ పరిధిలోకి రాదంటూ పక్క స్టేషన్లకు నెట్టేయడం, సూటిపోటి మాటలతో వేధించడం వంటివి ఈ తనిఖీల్లో బయటపడ్డాయి. అంతేకాకుండా, ఫిర్యాదును వెంటనే స్వీకరించకుండా 'రేపు రా.. మాపు రా..' అంటూ బాధితులను రోజుల తరబడి తిప్పించుకున్నట్లు స్పష్టమైంది. ఈ సందర్భంగా అధికారులను ఉద్దేశించి సజ్జనార్ భావోద్వేగంగా మాట్లాడారు. "మీ కుటుంబ సభ్యులే ఏదైనా సమస్యపై ఫిర్యాదు చేసేందుకు పోలీస్ స్టేషన్‌కు వెళ్లినప్పుడు, అక్కడ ఇలాంటి ఇబ్బందికర పరిస్థితులే ఎదురైతే మీరెలా భావిస్తారో ఒక్కసారి ఆత్మపరిశీలన చేసుకోండి" అని హితవు పలికారు. ఇకపై ప్రజా సమస్యల పట్ల అలసత్వం వహిస్తే సస్పెన్షన్లు, బదిలీలు తప్పవని ఆయన గట్టిగా హెచ్చరించారు.

# బీజేపీ సభ్యత్వం ఉంటేనే పౌరసత్వమా?

**పాస్‌పోర్టు వివాదంపై ఒవైసీ ఆగ్రహం**

హైదరాబాద్; జూన్ 25 (ఈవార్తలు): పౌరసత్వం అంశంపై కేంద్ర ప్రభుత్వ విధానాలను ఏఐఎంఐఎం అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ తీవ్రంగా తప్పుబట్టారు. పాస్‌పోర్టు ఉన్నా అది పౌరసత్వానికి పూర్తి ఆధారం కాదన్న వాదనలపై మండిపడ్డారు. ఇటువంటి వ్యాఖ్యలు ప్రజల్లో మరింత గందరగోళానికి దారితీస్తాయని అన్నారు. సోషల్ మీడియా వేదిక 'ఎక్స్'లో స్పందించిన ఓవైసీ, కేంద్ర ప్రభుత్వ తీరుపై వ్యంగ్యాస్త్రాలు సంధించారు. ఈ పరిస్థితి చూస్తుంటే భవిష్యత్తులో బీజేపీ సభ్యత్వ కార్డు ఉన్నవారికే పౌరసత్వం ఇస్తారేమోనని ఎద్దేవా చేశారు. దీనికి సంబంధించిన బీజేపీ సభ్యత్వ కార్డుల చిత్రాలను కూడా తన పోస్టులో పంచుకున్నారు. భారత పౌరుడిగా ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందే ప్రధాన పత్రాల్లో పాస్‌పోర్టు ఒకటని, అలాంటి పత్రాన్నే పౌరసత్వానికి ఆధారం కాదని చెప్పడం ఆశ్చర్యకరమని వ్యాఖ్యానించారు.




## రేపు వరంగల్‌లో

# కౌశల్ మహోత్సవ్-2026

**యువతకు 5,000కుపైగా ఉద్యోగ అవకాశాలు**

హైదరాబాద్, జూన్ 25 (పీఐబీ): కేంద్ర నైపుణ్యాభివృద్ధి, వ్యవస్థాపకత మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 27న వరంగల్‌లోని కాకతీయ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ (కిట్స్) ప్రాంగణంలో 'కౌశల్ మహోత్సవ్–వరంగల్ 2026' నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా తెలంగాణ యువతకు 5,000కు పైగా ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు వెల్లడించారు. కిట్స్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో నైపుణ్యాభివృద్ధి, వ్యవస్థాపకత మంత్రిత్వ శాఖ డైరెక్టర్ వి.ఎస్. అరవింద్ ఈ వివరాలను వెల్లడించారు. ఈ సమావేశంలో ఉపాధి, శిక్షణ శాఖ ప్రాంతీయ ఉపాధి అధికారి తౌటం రాము, కిట్స్ రిజిస్ట్రార్ కోమల్ రెడ్డి పాల్గొన్నారు. కౌశల్ మహోత్సవ్‌లో వివిధ రంగాలకు చెందిన 50కు పైగా ప్రముఖ సంస్థలు పాల్గొని అభ్యర్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నాయి. నైపుణ్యాలు కలిగిన యువతను పరిశ్రమలతో నేరుగా అనుసంధానించడం, అక్కడికక్కడే ఇంటర్వ్యూలు నిర్వహించడం, ఉపాధి మరియు అప్రెంటిస్‌షిప్ అవకాశాలు అందించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యంగా నిర్వాహకులు పేర్కొన్నారు. పాఠశాల విద్య పూర్తిచేసిన యువత, ఐటీఐ ఉత్తీర్ణులు, డిప్లొమా హోల్డర్లు, డిగ్రీ పట్టభద్రులు, ఇతర నైపుణ్యాలు కలిగిన అభ్యర్థులు ఈ మహోత్సవంలో పాల్గొనవచ్చు. తయారీ, రిటైల్, లాజిస్టిక్స్, ఆటోమొబైల్, టెక్స్‌టైల్, ఐటీ–ఐటీఈఎస్, ఆరోగ్య సేవలు, పర్యాటకం––ఆతిథ్య రంగం, టెలికాం, బ్యాంకింగ్––ఫైనాన్షియల్ సర్వీసెస్ అండ్ ఇన్సూరెన్స్ తదితర రంగాలకు చెందిన సంస్థలు నియామక ప్రక్రియలో పాల్గొంటాయి. ఈ సందర్భంగా వి.ఎస్. అరవింద్ మాట్లాడుతూ, ప్రతి నైపుణ్యం కలిగిన యువకుడికి అర్థవంతమైన ఉపాధి అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో కౌశల్ మహోత్సవ్‌ను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఉద్యోగదాతలు, ఉద్యోగార్థులను ఒకే వేదికపైకి తీసుకువచ్చి నైపుణ్యాభివృద్ధి నుంచి ఉపాధి వరకు బలమైన అనుసంధానాన్ని ఏర్పాటు చేయడం ద్వారా తెలంగాణ యువత ఆశయాలను సాకారం చేయడంలో ఈ కార్యక్రమం కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు.



# 'డేటా సెంటర్ సిటీ' వస్తోంది!

## హైదరాబాద్ శివారులో ఏర్పాటు.. 1500 ఎకరాల్లో ప్రాజెక్ట్

హైదరాబాద్, జూన్ 25 (ఈవార్తలు): డిజిటల్ రంగంలో సరికొత్త చరిత్ర సృష్టించేందుకు తెలంగాణ ప్రభుత్వం అడుగులు వేస్తోంది. అంతర్జాతీయ డిజిటల్ పటంలో హైదరాబాద్ స్థానాన్ని సుస్థిరం చేయడమే లక్ష్యంగా దేశంలోనే మొట్టమొదటి ప్రత్యేక డేటా సెంటర్ సిటీ స్థాపనకు శ్రీకారం చుట్టింది. హైదరాబాద్‌కు శివారులో రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండలం ఆలూర్ గ్రామంలో సుమారు 1500 ఎకరాల విస్తీర్ణంలో ఈ భారీ ప్రాజెక్టును నిర్మించనున్నారు. అంతర్జాతీయ స్థాయి హైపర్‌స్కేల్ డేటా నిర్వాహకులను ఆకర్షించేలా, పర్యావరణ అనుకూలమైన స్థిరమైన మౌలిక సదుపాయాలు, నిరంతర విద్యుత్ సరఫరాతో ఈ సిటీని డిజైన్ చేస్తున్నారు. ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టుపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రతిపాదిత డేటా సెంటర్ సిటీకి అవసరమైన నీరు, విద్యుత్, ఇంటర్నెట్ కనెక్టివిటీ వంటి మౌలిక వసతులపై సమగ్ర నివేదికను సిద్ధం చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఐటీ, పరిశ్రమల శాఖ ఇప్పటికే ఈ ప్రాజెక్టుకు అవసరమైన భూమిని గుర్తించి, ప్రాథమిక ప్రక్రియను వేగవంతం చేసింది. ప్రస్తుతం హైదరాబాద్ పరిసరాల్లో 150 నుంచి 200 మెగావాట్ల సామర్థ్యం గల డేటా సెంటర్లు నడుస్తుండగా.. ప్రభుత్వం భూములు కేటాయించిన మరో 5 గిగావాట్ల ప్రాజెక్టులు పైప్‌లైన్‌లో ఉన్నాయి. రాబోయే రోజుల్లో వివిధ సంస్థలతో కుదుర్చుకున్న ఒప్పందాల ద్వారా తెలంగాణలో మొత్తం డేటా సెంటర్ల సామర్థ్యం ఏకంగా 11 గిగావాట్లకు పైగా దాటనుందని సీఎంవో కార్యాలయం వెల్లడించింది. ఇప్పటికే హైదరాబాద్‌లో అమెజాన్, మైక్రోసాఫ్ట్ వంటి గ్లోబల్ దిగ్గజాలతో పాటు ఓతీశ్రీూ, క్యాపిటాలాండ్, చీు డేటా, సిఫీ, ఎస్‌టీటీ గ్లోబల్ వంటి సంస్థలు తమ కేంద్రాలను నడుపుతున్నాయి. డేటా సెంటర్ల నిర్వహణకు భారీగా నీటి అవసరం ఉంటుంది. ముఖ్యంగా చందన్‌వెల్లి, భారత్ ఫ్యూచర్ సిటీ పరిధిలోని క్లస్టర్ల నీటి ఎద్దడిని నివారించేందుకు ప్రభుత్వం సర్క్యులర్ ఎకానమీ విధానాన్ని తెరపైకి తెచ్చింది. ఇందులో భాగంగా నగరంలోని సెవెజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ల నుంచి సేకరించిన మురుగునీటిని అత్యాధునిక సాంకేతికతతో శుద్ధి చేసి పరిశ్రమలకు సరఫరా చేస్తారు. పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్‌షిప్ పద్ధతిలో ఈ నీటి సరఫరా ప్రాజెక్టును చేపట్టనున్నారు. హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సప్లై అండ్ సీవరేజ్ బోర్డ్ ప్రస్తుతం రోజుకు 1750 మిలియన్ లీటర్ల మురుగునీటిని శుద్ధి చేసే సామర్థ్యంతో 41 ఎస్టీపీలను నిర్వహిస్తోంది. ఇందులో నుంచి దాదాపు 530 ఎంఎల్‌డీ శుద్ధి చేసిన నీటిని పారిశ్రామిక అవసరాల కోసం మళ్లించేలా డీపీఆర్ సిద్ధం చేస్తున్నారు. దీని కోసం రెండు ప్రధాన పైప్‌లైన్ మార్గాలను అధికారులు ప్రతిపాదించారు. మొదటిది.. అత్తాపూర్ ఎస్టీపీ నుంచి చందన్‌వెల్లి వరకు 41 కిలోమీటర్ల పొడవైన పైప్‌లైన్ నిర్మిస్తారు. దీని ద్వారా చందన్‌వెల్లిలోని డేటా సెంటర్లు, వెల్‌స్పన్ వంటి ఉత్పాదక పరిశ్రమలకు ద్వితీయ, తృతీయ శ్రేణిలో శుద్ధి చేసిన నీటిని అందిస్తారు. ఇక్కడ 2035 నాటికి నీటి డిమాండ్ 239 ఎంఎల్‌డీకి చేరుతుందని అంచనా. ఇక రెండోది, నాగోల్ ఎస్టీపీల నుంచి నెట్ జీరో స్మార్ట్ అర్బన్ డెవలప్‌మెంట్‌గా రూపుదిద్దుకుంటున్న భారత్ ఫ్యూచర్ సిటీ వరకు 56.6 కిలోమీటర్ల పైప్‌లైన్ వేస్తారు. ఇక్కడ 2035 నాటికి డిమాండ్ 290 ఎంఎల్‌డీగా ఉండనుంది. ఈ రెండు పైప్‌లైన్లు 158 కిలోమీటర్ల పొడవైన ఔటర్ రింగ్ రోడ్డు వెంబడి సాగడం వల్ల రామచంద్రాపురం, పటాన్‌చెరు, బీహెచ్‌ఈఎల్, సుల్తాన్‌పూర్, జీడిమెట్ల వంటి పారిశ్రామిక ప్రాంతాలకు కూడా ఈ నీరు ఉపయోగపడనుంది. అలాగే ఓఆర్ఆర్ వెంబడి మొక్కల పెంపకానికి, అగ్నిమాపక అవసరాలకు కూడా ఈ నీటిని వాడుకుంటారు. విద్యుత్ వినియోగం ఎక్కువగా ఉండే ఈ రంగం కోసం కంపెనీలకు ఓపెన్ యాక్సెస్ ద్వారా విద్యుత్ పొందే సదుపాయాన్ని కూడా ప్రభుత్వం పరిశీలిస్తోంది. శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు దగ్గరగా ఉండటం, మౌలిక వసతులు బాగుండటంతో చందన్‌వెల్లి, ఫ్యాబ్ సిటీలు ఇప్పటికే అంతర్జాతీయ పెట్టుబడులకు కేరాఫ్ అడ్రస్‌గా మారాయి.

# మీరిచ్చే ప్రతి పైసా.. ప్రజాస్వామ్య పరిరక్షణకే!

ఉన్నది ఉన్నట్లు చెప్పే తత్వం..
ఎవరికీ కొమ్ముకాయని పథం..
ప్రజా సమస్యలపై యుద్ధం..
ప్రజా హితమే మా శపథం..
ప్రజాపోరులో మేము సంసిద్ధం..
ఇదే నేటి 'ఈవార్తలు' నైజం!

*అక్షరమే అస్త్రంగా, ప్రభుత్వాన్ని సరైన దారిలో నడిపించే శస్త్రంగా, వార్తలను నిక్కచ్చిగా అందిస్తూ సాగుతున్న అలుపెరుగని ప్రయాణం మాది. పాలకుల తప్పులను ఎండగడుతూ, వ్యవస్థలను గాడిలో పెట్టే శక్తిమంతమైన శస్త్రం నేటి 'ఈవార్తలు'. ఎవరికీ తలొగ్గని కలం, న్యాయం కోసం గొంతెత్తే గళం.. మన పత్రిక. నిష్పక్షపాత జర్నలిజం మనుగడ సాగించాలంటే అది ప్రజాబలంతోనే సాధ్యం. మీరు అందించే ప్రతి పైసా ఆర్థిక దన్ను మాత్రమే కాదు, అక్రమాలపై మేము ఎక్కుపెట్టే అస్త్రానికి పదును. ప్రజాసమస్యలపై రాజీలేని పోరాటానికి, నిజాలను నిర్భయంగా చాటిచెప్పడానికి మాతో చేయి కలపండి. సత్యాన్వేషణలో భాగస్వాములుకండి.. ప్రజాస్వామ్య పరిరక్షణలో తోడుగా నిలవండి.*

- శ్రావణ్ కుమార్ బొమ్మకంటి, ఎడిటర్

**సందేహాలకు 94404 55811 నంబర్‌ను సంప్రదించవచ్చు.**

# 21 జిల్లాల్లో ఉరుములతో వర్షాలు

**హైదరాబాద్ వాతావరణ శాఖ హెచ్చరిక**

హైదరాబాద్, జూన్ 25 (ఈవార్తలు): రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఉరుములు మెరుపులతో కూడిన వర్షం కురుస్తుందని హైదరాబాద్ వాతావరణ శాఖ అంచనా వేసింది. ఆదిలాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, జగిత్యాల, జనగామ, జోగులాంబ గద్వాల, కామారెడ్డి, కరీంనగర్, ఖమ్మం, కుమ్రంభీం ఆసిఫాబాద్, మహబూబాబాద్, మంచిర్యాల, మెదక్, ములుగు, నాగర్‌కర్నూలు, నారాయణపేట, నిర్మల్, నిజామాబాద్, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల, సంగారెడ్డి, సిద్దిపేట, సూర్యాపేట, వనపర్తి, వరంగల్, హనుమకొండ జిల్లాల్లో తేలికపాటి వర్షాలు కురుస్తాయని తెలిపింది. ఈ మేరకు 21 జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. ఇక రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో అక్కడక్కడ తేలికపాటి వర్షాలు కురుస్తాయని పేర్కొంది. శనివారం ఆదిలాబాద్, కుమ్రంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, నాగర్‌కర్నూలు, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురుస్తాయని అంచనా వేసింది. ఆదివారం ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురుస్తాయని తెలిపింది. సోమవారం నాడు రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురుస్తాయని పేర్కొంది.

# రాజకీయాలు దిగజారిపోయాయి: కిరణ్ కుమార్ రెడ్డి

తిరుపతి, జూన్ 25 (ఈవార్తలు): ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ చివరి ముఖ్యమంత్రి నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి నేటి రాజకీయాల తీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. తిరుపతి జిల్లా చిన్నగొట్టిగల్లు పర్యటనలో ఆయన మాట్లాడుతూ... ప్రస్తుత పొలిటికల్ ట్రెండ్, టీవీ డిబేట్లు, సోషల్ మీడియా ట్రోలింగ్ సంస్కృతిపై తన మనసులోని ఆవేదనను బయటపెట్టారు. ఒకప్పుడు రాజకీయాలు పాలసీ మేకింగ్‌కు కేరాఫ్ అడ్రస్‌గా ఉండేవని, ఇప్పుడు కేవలం వ్యక్తిగత విమర్శలుగా మారిపోయాయని చెప్పారు. సమాజంలో మిగిలిన ప్రొఫెషన్స్‌తో పోలిస్తే రాజకీయాల్లో విలువలు దారుణంగా పడిపోతున్నాయని కిరణ్ కుమార్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. "డాక్టర్లు, న్యాయవాదులు వంటి వృత్తుల్లో ఉన్నవారు కోర్టుల్లోనో, బయటో ఎంత వాదించుకున్నా ఒకరినొకరు వ్యక్తిగతంగా గౌరవించుకుంటారు. అవసరమైనప్పుడు పరస్పరం మద్దతు ఇచ్చుకుంటారు. కానీ, రాజకీయాల్లో మాత్రం సీన్ రివర్స్ అయింది. సిద్ధాంతాలు పక్కనబెట్టి ఒకరినొకరు కించపరుచుకుంటూ వ్యక్తిగత దూషణలకు దిగడం ఎక్కువవుతోంది" అని విమర్శించారు. ప్రస్తుత మీడియా కల్చర్‌పై కూడా మాజీ సీఎం గట్టిగానే కౌంటర్ వేశారు. "ఇప్పుడు వస్తున్న టీవీ డిబేట్లను కుటుంబ సభ్యులతో కలిసి కూర్చుని చూసే పరిస్థితి అస్సలు లేదు. ఆ చర్చల్లో వాడే భాష, అరచుకునే విధానం చూస్తే.. అసలు టీవీనే ఆఫ్ చేసేయాలనే అంతటి విరక్తి కలుగుతోంది" అని పేర్కొన్నారు. అలాగే సోషల్ మీడియా వేదికగా సాగుతున్న అసభ్య పదజాలం, ట్రోలింగ్ సంస్కృతి ఏమాత్రం మంచి పద్ధతి కాదని హితవు పలికారు. రాజకీయాలు అంటే ప్రజలకు సంబంధించినవని, అక్కడ వ్యక్తిగత అజెండాలకు తావుండకూడదని కిరణ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ప్రభుత్వాలు తెచ్చే పాలసీలు, రాష్ట్ర అభివృద్ధి, ప్రజలు ఎదుర్కొంటున్న గ్రౌండ్ లెవెల్ సమస్యలపై అసెంబ్లీల్లో, బయట చర్చలు జరగాలే తప్ప.. వ్యక్తిగత ఆరోపణలతో రాజకీయాల స్థాయిని దిగజార్చవద్దని లీడర్లకు సూచించారు. నాయకుల మధ్య పరస్పర గౌరవం లేకపోవడం వల్లే పబ్లిక్‌లో రాజకీయ విలువల గ్రాఫ్ క్షీణిస్తోందని హెచ్చరించారు.

# ఆర్థిక మాంద్యం వైపు ఏపీ: జగన్



తాడేపల్లి, జూన్ 25 (ఈవార్తలు): ఏపీలోని కూటమి ప్రభుత్వంపై వైసీపీ అధినేత జగన్ మరోసారి తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. డ్వాక్రా మహిళలకు ఇచ్చిన కీలక హామీలను చంద్రబాబు సర్కార్ పూర్తిగా విస్మరించిందని, వడ్డీ రాయితీ పథకాన్ని నిలిపివేసి మహిళా సంఘాలను నిర్వీర్యం చేస్తోందంటూ ఎక్స్ వేదికగా ఆయన సుదీర్ఘమైన పోస్ట్ పెట్టారు. ఏపీలో పన్ను ఆదాయ వృద్ధి పడిపోయిందని, రాష్ట్రం ఆర్థిక మాంద్యం వైపు వెళ్తోందంటూ ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం డ్వాక్రా సంఘాల రుణాలపై వడ్డీ రాయితీ పరిమితిని రూ.3 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచుతామని సూపర్ సిక్స్ తరహాలో హామీ ఇచ్చిందని జగన్ అన్నారు. కానీ అధికారంలోకి వచ్చాక ఆ మాట తప్పారని మండిపడ్డారు. తమ వైసీపీ ప్రభుత్వ హయాంలో స్వయం సహాయక సంఘాల మహిళలకు రూ.4,969 కోట్ల మేర వడ్డీ రాయితీతో పాటు ఆసరా, చేయూత వంటి స్కీమ్స్‌తో ఆర్థిక భరోసా ఇచ్చామని తెలిపారు. కూటమి ప్రభుత్వం వచ్చాక 2024–25 ఆర్థిక సంవత్సరంలో వడ్డీ రాయితీ కింద ఒక్క రూపాయి కూడా విడుదల చేయలేదని జగన్ ఆరోపించారు. 2025–26 బడ్జెట్‌లో రూ.100 కోట్లు, మళ్లీ ఇప్పుడు 2026–27 బడ్జెట్‌లోనూ రూ.100 కోట్లు కేటాయించినప్పటికీ.. ఆ నిధులు కేవలం కాగితాలకే పరిమితమయ్యాయని, గ్రౌండ్ లెవెల్లో ఒక్క పైసా కూడా విడుదల కాలేదన్నారు. ఈ వడ్డీ రాయితీ అమలు చేయకపోవడం వల్ల గత రెండేళ్లలో డ్వాక్రా మహిళలకు సుమారు రూ.6 వేల కోట్ల మేర నష్టం జరిగిందని విమర్శించారు. 2023–24లో రూ.49,696 కోట్లుగా ఉన్న డ్వాక్రా రుణ వృద్ధి.. కూటమి పాలనలో 2024–25 నాటికి రూ.41,623 కోట్లకు, 2025–26లో మరింత తగ్గి రూ.41,105 కోట్లకు పడిపోయిందని అన్నారు. అంతేకాదు, 2025–26లో రాష్ట్ర పన్ను ఆదాయ వృద్ధి –3.22 శాతంగా నమోదైందని... ఇది ఏపీలో స్పష్టమైన ఆర్థిక మాంద్యానికి సంకేతమని ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా ఉన్న మహిళా సంఘాలను నిర్లక్ష్యం చేస్తే రాష్ట్రం మరింత సంక్షోభంలో పడుతుందని హెచ్చరిస్తూ, బకాయిలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

# తహసీల్దార్ సుచరితకు 5 కోట్ల అక్రమాస్తులు



హైదరాబాద్, జూన్ 25 (ఈవార్తలు): లంచం కేసులో అరెస్టయి సస్పెన్షన్‌కు గురైన షామీర్‌పేట మాజీ తహసీల్దార్ టి. సుచరిత మెడకు మరో ఉచ్చు బిగుసుకుంది. ఆమెపై ఆదాయానికి మించిన ఆస్తుల (డీఏ) కేసును అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) నమోదు చేసింది. లంచం తీసుకుంటూ పట్టుబడిన నెల రోజులకే ఈ కొత్త కేసు నమోదు కావడం గమనార్హం. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా షామీర్‌పేట మండలంలో తహసీల్దార్, ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్, జాయింట్ సబ్–రిజిస్ట్రార్‌గా పనిచేసిన సుచరిత, ఆమె డ్రైవర్ వి. నగేష్‌ను మే 26, 2026న ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. 30 ఎకరాల వ్యవసాయ భూమికి నాలా మార్పిడి కోసం ఒక వ్యక్తి నుంచి ఎకరాకు లక్ష రూపాయల చొప్పున మొత్తం రూ. 30 లక్షలు డిమాండ్ చేశారు. అందులో భాగంగా రూ. 2 లక్షలు ముడుపులు తీసుకుంటుండగా అధికారులు వీరిని అదుపులోకి తీసుకున్నారు. ఈ క్రమంలో అవినీతి ద్వారా అక్రమంగా ఆస్తులు కూడబెట్టారనే ఆరోపణలపై జూన్ 25న సుచరితపై ఏసీబీ అధికారులు అక్రమాస్తుల కేసు నమోదు చేశారు. ఆమె నివాసంతో పాటు ఇతర మూడు ప్రాంతాల్లో జరిపిన సోదాల్లో భారీగా ఆస్తులు బయటపడ్డాయి. అధికారులు స్వాధీనం చేసుకున్న వాటిలో రూ. 12 లక్షల నగదు, రూ. 1.2 కోట్ల విలువైన బంగారం, వజ్రాభరణాలు ఉన్నాయి. వీటితో పాటు బ్యాంకు ఖాతాల్లో రూ. 38 లక్షలు, ఒక వోక్స్‌వ్యాగన్, ఒక హ్యుందాయ్ క్రెటా కార్లు, హైదరాబాద్‌లో మూడు ఫ్లాట్లు, కీసర, ఖానామెట్ గ్రామాల్లో రెండు ప్లాట్లు, సిద్దిపేట జిల్లా దమ్మరకుంట గ్రామంలో వ్యవసాయ భూమి ఉన్నట్లు గుర్తించారు. ఈ ఆస్తుల మొత్తం విలువ సుమారు 5.05 కోట్ల రూపాయలుగా ఉంటుంది. లంచం కేసు తర్వాత సస్పెన్షన్‌కు గురైన సుచరితపై తాజాగా నమోదైన అక్రమాస్తుల కేసులో దర్యాప్తు కొనసాగుతోందని ఏసీబీ అధికారులు తెలిపారు.

## పిరమిడ్ స్కీమ్‌ల ఉచ్చులో పడొద్దు

**వ్యాపారవేత్త నితిన్ కామత్ హెచ్చరిక**

న్యూఢిల్లీ: ఒక్క రాత్రిలో ధనవంతులు కావాలని చాలా మంది కలలు కంటుంటారు. ముఖ్యంగా యువతలో త్వరగా డబ్బు సంపాదించాలనే ఆలోచన ఎక్కువగా కనిపిస్తుంది. అయితే అలాంటి ఆశలే కొన్నిసార్లు మోసాల బారిన పడేలా చేస్తాయని జీరోధా వ్యవస్థాపకుడు నితిన్ కామత్ హెచ్చరించారు. తాను కూడా కెరీర్ ప్రారంభ దశలో ఓ పిరమిడ్ స్కీమ్‌లో చిక్కుకున్నానంటూ ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. అమెరికన్ వెబ్ సిరీస్ 'పిరమిడ్ స్కీమ్' చూసిన తర్వాత తన గత అనుభవాలు గుర్తొచ్చాయని నితిన్ కామత్ సోషల్ మీడియాలో వెల్లడించారు. 18 ఏళ్ల వయసులో ట్రేడింగ్ కోసం డబ్బు సమకూర్చుకునే ప్రయత్నాల్లో భాగంగా ఓ మల్టీ లెవెల్ మార్కెటింగ్ కంపెనీలో చేరానని చెప్పారు. దాదాపు రెండేళ్ల పాటు అందులో కొనసాగానని, తర్వాత అది పిరమిడ్ స్కీమ్ అని తెలిసిందన్నారు. తనను ఆ వ్యాపారంలోకి తీసుకువచ్చిన వ్యక్తి మోసం చేశాడని అనుకోవడం లేదని, అసలు కంపెనీనే వేలాది మందిని తప్పుదోవ పట్టించిందని పేర్కొన్నారు. తాను కూడా మరికొందరిని అందులోకి తీసుకురావడం ఇప్పటికీ బాధ కలిగిస్తుందని చెప్పారు.

## మళ్లీ కనిపిస్తే చంపేస్తా

**జర్నలిస్టుకు ఎంపీ సంజయ్ పాటిల్ బెదిరింపులు**

ముంబై: మహారాష్ట్ర రాజకీయాల్లో మరో వివాదం రేగింది. ఇటీవల షిండే వర్గంలో చేరిన శివసేన ఎంపీ సంజయ్ దీనా పాటిల్, జర్నలిస్టులను ఉద్దేశించి చేసిన అనుచిత వ్యాఖ్యలు తీవ్ర కలకలం సృష్టించాయి. తన కుటుంబ సభ్యుల రాజకీయ విధేయతపై ప్రశ్నించినందుకు ఆగ్రహం వ్యక్తం చేస్తూ, "మళ్లీ వస్తే చంపేస్తా" అంటూ ఆయన బెదిరించిన వీడియో వైరల్ కావడంతో రాజకీయ దుమారం చెలరేగింది. గురువారం కొందరు విలేకరులు సంజయ్ పాటిల్‌ను కలిశారు. ఆయన ఇటీవల ఉద్ధవ్ థాకరే వర్గాన్ని వీడి షిండే వర్గంలో చేరగా, ఆయన కుమార్తె, కార్పొరేటర్ అయిన రాజుల్ పాటిల్ మాత్రం ఉద్ధవ్ వర్గంలోనే కొనసాగుతున్నారు. ఇదే విషయంపై జర్నలిస్టులు ప్రశ్నించడంతో సంజయ్ పాటిల్ సహనం కోల్పోయారు. "నా వ్యక్తిగత విషయాలతో మీకేం పని? మళ్లీ నా వద్దకు వస్తే చంపేస్తా" అంటూ తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఘటనపై రాజకీయంగా తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. ఈ నేపథ్యంలో ఉప ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే వెంటనే నష్ట నివారణ చర్యలు చేపట్టారు. పాటిల్ వ్యాఖ్యలు ఎవరినైనా బాధించి ఉంటే క్షమాపణ చెప్పాలని ఆయనకు సూచించినట్లు తెలిపారు. ప్రత్యర్థి వర్గం కావాలని కుటుంబ సభ్యులను లక్ష్యంగా చేసుకుని దాడులుచేస్తున్నందునే పాటిల్ అలా స్పందించి ఉంటారని ఆయన పేర్కొన్నారు. కాగా, ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ స్పందిస్తూ, ఎవరిని బెదిరించినా అది తప్పేనని, ఘటనపై పూర్తి వివరాలు తెలుసుకున్నాక స్పందిస్తానని వెల్లడించారు.

## ఐబీఎం సరికొత్త చిప్ ఆవిష్కరణ

న్యూయార్క్: కంప్యూటర్ చిప్‌ల అభివృద్ధిలో మరో చరిత్రాత్మక మైలురాయి నమోదైంది. అమెరికాకు చెందిన టెక్నాలజీ దిగ్గజం ఐబీఎం ప్రపంచంలోనే తొలి సబ్-1 నానోమీటర్ (0.7 నానోమీటర్) చిప్ టెక్నాలజీని ఆవిష్కరించింది. ప్రస్తుతం సెమీకండక్టర్ పరిశ్రమ ఎదుర్కొంటున్న భౌతిక పరిమితులను దాటే దిశగా ఇది కీలక ముందడుగుగా భావిస్తున్నారు. ఈ కొత్త చిప్‌ను 0.7 నానోమీటర్ లేదా 7 ఆంగ్‌స్ట్రామ్ ప్రాసెస్ నోడ్‌పై రూపొందించారు. ఇందులో 'నానోస్టాక్' అనే సరికొత్త త్రీ-డైమెన్షనల్ ట్రాన్సిస్టర్ నిర్మాణాన్ని ఉపయోగించారు. దీని ద్వారా అణు స్థాయిలోనే మరింత అధిక పనితీరు, తక్కువ విద్యుత్ వినియోగం సాధ్యమవుతుందని ఐబీఎం తెలిపింది. గోరు గోటి పరిమాణంలో ఉండే ఈ చిప్‌లో దాదాపు 100 బిలియన్ ట్రాన్సిస్టర్లు అమర్చారు. 2021లో ఐబీఎం పరిచయం చేసిన 2 నానోమీటర్ చిప్‌తో పోలిస్తే ట్రాన్సిస్టర్ సాంద్రత దాదాపు రెట్టింపు కావడం విశేషం. ఈ టెక్నాలజీ వల్ల 2 నానోమీటర్ చిప్‌లతో పోలిస్తే 50 శాతం అధిక పనితీరు లేదా 70 శాతం ఎక్కువ విద్యుత్ సామర్థ్యం లభించే అవకాశం ఉందని కంపెనీ వెల్లడించింది. జనరేటివ్ ఏఐ, క్లౌడ్ కంప్యూటింగ్, భవిష్యత్ ఎలక్ట్రానిక్ పరికరాల అవసరాలను తీర్చడంలో ఈ చిప్ కీలక పాత్ర పోషించనుంది. ఐబీఎం రీసెర్చ్ డైరెక్టర్ జే గంబెట్టా మాట్లాడుతూ.. ఈ ఆవిష్కరణ కంప్యూటింగ్‌ను నానోమీటర్ యుగం నుంచి అణు స్థాయి యుగంలోకి తీసుకెళ్తుందని అన్నారు. నానోస్టాక్ నిర్మాణంలో ట్రాన్సిస్టర్లను నిలువుగా అమర్చడం వల్ల ఒకే చిప్‌లో మరిన్ని భాగాలను పొందుపరచవచ్చని, అలాగే పనితీరు, విద్యుత్ వినియోగాన్ని విడివిడిగా మెరుగుపర్చే అవకాశం ఉంటుందని కంపెనీ వివరించింది. అమెరికాలోని న్యూయార్క్ రాష్ట్రంలోని అల్బనీ సెమీకండక్టర్ పరిశోధనా కేంద్రంలో ఈ పరిశోధనలు జరిగాయి. ఈ సాంకేతికత ఆధారంగా రూపొందిన చిప్‌లు వచ్చే ఐదేళ్లలో వాణిజ్యపరంగా అందుబాటులోకి వచ్చే అవకాశముందని ఐబీఎం అంచనా వేస్తోంది.

## భారత్ ఆతిథ్యానికి మురిసిపోయా: మెలోని

రోమ్: ఇటలీ ప్రధాని జార్జియా మెలోనికి భారత్‌పై ఉన్న ప్రత్యేక అభిమానం మరోసారి అంతర్జాతీయంగా హాట్ టాపిక్‌గా మారింది. ప్రధాని మోదీ ఆమెకు 'మెలోడీ' చాక్లెట్లు కానుకగా ఇచ్చిన విజువల్స్ ఆల్రెడీ సోషల్ మీడియాలో వైరల్ అవ్వగా... తాజాగా ఆమె రాసిన సరికొత్త పుస్తకం 'జార్జియాస్ విజన్'లో భారత్ పర్యటన తాలూకు ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. ఢిల్లీ పర్యటనలో తనకు లభించిన గ్రాండ్ వెల్‌కమ్ గురించి రాస్తూ... రోడ్డుకు ఇరువైపులా తన భారీ పోస్టర్లను చూసి మురిసిపోయానని మెలోని పేర్కొన్నారు. ఆ సమయంలో తన పక్కనే ఉన్న ఇటలీ ఉప ప్రధాని ఆంటోనియో తజని.. "ఈ క్రేజ్ చూస్తుంటే మీరు గనుక ఢిల్లీ నియోజకవర్గం నుండి ఎన్నికల్లో పోటీ చేస్తే కనీసం 10 లక్షల మెజారిటీతో గెలుస్తారు" అంటూ సరదాగా చమత్కరించిన విషయాన్ని వెల్లడించారు. 2023లో రైసినా డైలాగ్, జీ20 సదస్సుల కోసం రెండుసార్లు భారత్‌లో పర్యటించిన మెలోని.. "అడుగడుగునా నా ఫొటోలతో స్వాగతం పలికిన భారత్‌కు థాంక్స్" అంటూ మన దేశంపై తనకున్న అభిమానాన్ని చాటుకున్నారు.

## మార్కెట్లకు స్వల్ప లాభాలు

ముంబై: స్టాక్ మార్కెట్‌లో గురువారం ఆరంభంలో మంచి ఊపు కనిపించింది. కానీ, చివరకు అమ్మకాల ఒత్తిడి పెరగడంతో లాభాలు గణనీయంగా తగ్గాయి. ఐటీ, మెటల్, ఆయిల్ అండ్ గ్యాస్ షేర్లలో విక్రయాలు పెరగడం మార్కెట్‌పై ప్రభావం చూపింది. అయినప్పటికీ సెన్సెక్స్, నిఫ్టీ స్వల్ప లాభాలతో ముగిశాయి. నిఫ్టీ 34 పాయింట్లు పెరిగి 24,056 వద్ద ముగిసింది. సెన్సెక్స్ 109 పాయింట్లు లాభపడి 77,100 వద్ద స్థిరపడింది. ఓఎన్‌జీసీ, పవర్‌గ్రిడ్, హిందాల్కో షేర్లు ఎక్కువగా నష్టపోయాయి. మరోవైపు ఆటో, ఎఫ్‌ఎంసీజీ రంగాలకు చెందిన షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించింది. నిఫ్టీ మిడ్‌క్యాప్ సూచీ 0.55 శాతం, స్మాల్‌క్యాప్ సూచీ 0.47 శాతం చొప్పున నష్టపోయాయి. రంగాల వారీగా చూస్తే మెటల్ సూచీ అత్యధిక నష్టాలు నమోదు చేసింది. ఐటీ, ఆయిల్ అండ్ గ్యాస్ సూచీలు కూడా ఒత్తిడికి గురయ్యాయి. చమురు ధరలు తగ్గడం రూపాయికి మద్దతు ఇచ్చినప్పటికీ, మార్కెట్‌లో కొనుగోళ్ల ఉత్సాహాన్ని కొనసాగించడానికి అది సరిపోలేదని నిపుణులు పేర్కొన్నారు.

## జమ్మూకశ్మీర్ పోలీసులపై జవాన్ల దాడి

**కమాండింగ్ ఆఫీసర్, మేజర్ సహా 40 మందిపై కేసు నమోదు**

న్యూఢిల్లీ: దేశాన్ని రక్షించే సైనికులకు, స్థానిక లా అండ్ ఆర్డర్ కాపాడే పోలీసులకు మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. జమ్మూకశ్మీర్‌లోని కిష్టవార్ జిల్లాలోని అథోలి పోలీస్ స్టేషన్‌పై కర్రలు, రాడ్లతో ఆర్మీ సిబ్బంది దాడికి తెగబడ్డారనే ఆరోపణలపై.. ఒక కమాండింగ్ ఆఫీసర్, మేజర్ సహా ఏకంగా 40 మంది ఆర్మీ సిబ్బందిపై పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేయడం నేషనల్ లెవెల్లో హాట్ టాపిక్‌గా మారింది. పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం... 17 రాష్ట్రీయ రైఫిల్స్ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ ఎన్. అరుణ్ గాంధీ, మేజర్ వికాశ్ శర్మ, నయిబ్ సుబేదార్ శంకర్ గుర్కే సహా 40 మంది ఆర్మీ జవాన్లపై పోలీసులు కేసు ఫైల్ చేశారు. ప్రభుత్వ అధికారులపై దాడి చేయడం, పోలీస్ స్టేషన్ లోపలికి చొరబడి విధుల్లో ఉన్న సిబ్బందిని విచక్షణారహితంగా కొట్టడం వంటి తీవ్ర ఆరోపణలతో... వీరిపై హత్యాయత్నం, పబ్లిక్ ప్రాపర్టీ ధ్వంసం చట్టాల కింద కఠినమైన లీగల్ సెక్షన్లు నమోదు చేశారు.

# ఎప్పటికీ క్షమించవద్దు.. మర్చిపోవద్దు



**ఎమర్జెన్సీ ఒక ఘోర పాపం: ప్రధాని మోదీ**

న్యూఢిల్లీ: దేశంలో ఎమర్జెన్సీ విధించి 51 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ కాంగ్రెస్ పార్టీపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. భారత ప్రజాస్వామ్య చరిత్రలోనే ఇది అత్యంత చీకటి అధ్యాయమని, కాంగ్రెస్ చేసిన ఘోరమైన పాపమని అభివర్ణించారు. ఎమర్జెన్సీని విధించిన వారిని దేశ ప్రజలు 'ఎప్పటికీ క్షమించవద్దు.. ఎప్పటికీ మర్చిపోవద్దు' అని ఆయన పిలుపునిచ్చారు. ఇన్‌స్టాగ్రామ్‌లో ప్రధాని మోదీ ఒక సుదీర్ఘ పోస్ట్ చేశారు. 'ఎమర్జెన్సీ 51వ వార్షికోత్సవం – భారత ప్రజాస్వామ్య చరిత్రలో ఎంతటి చీకటి అధ్యాయమో తెలుసుకోండి' అనే శీర్షికతో ఆనాటి పరిస్థితులను వివరించారు. "ఎమర్జెన్సీ కాలంలో పౌరుల హక్కులను, మీడియా స్వేచ్ఛను దారుణంగా అణచివేశారు. ప్రతిపక్ష నాయకులందరినీ అరెస్టు చేశారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా గళం విప్పిన వారిని, రాజకీయ అసమ్మతి తెలిపిన వారిని తీవ్రంగా అణచివేశారు. రచయితలు, జర్నలిస్టులు, సామాజిక కార్యకర్తలు, విద్యార్థులతో పాటు సామాన్య పౌరులను కూడా జైళ్లలో పెట్టి చిత్రహింసలకు గురిచేశారు" అని మోదీ ఆరోపించారు. ఆనాడు రాజ్యాంగాన్ని కాలరాశారని, న్యాయవ్యవస్థను రాజకీయ నియంత్రణలోకి తెచ్చేందుకు నీచమైన ప్రయత్నాలు జరిగాయని మోదీ విమర్శించారు. "మీడియాపై తీవ్రమైన ఆంక్షలు విధించారు. ప్రభుత్వ ఆదేశాలను పాటించని వారిని బెదిరించారు లేదా పత్రికలను మూసివేశారు. ప్రాథమిక హక్కులను సస్పెండ్ చేశారు. పౌరులను రక్షించాల్సిన ప్రతి వ్యవస్థ వారికే వ్యతిరేకంగా మారింది. పార్లమెంటును కేవలం ఒక 'రబ్బరు స్టాంపు'గా మార్చేశారు" అని ఆయన పేర్కొన్నారు. అంతటి నిర్బంధం మధ్య కూడా ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ఎందరో పోరాడారని మోదీ గుర్తుచేశారు. "వివిధ నేపథ్యాలు, సిద్ధాంతాలకు చెందిన ప్రజలందరూ ఏకమై ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగ విలువలను కాపాడేందుకు ముందుకు వచ్చారు. ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా జరిగిన ఆ ఉద్యమంలో పాలుపంచుకునే గౌరవం నాకు కూడా దక్కింది" అని ఆయన తెలిపారు. ప్రజల పోరాట స్ఫూర్తి (జనశక్తి) ముందు నాటి కాంగ్రెస్ ప్రభుత్వం తలవంచక తప్పలేదని, చివరికి ఎమర్జెన్సీని ఎత్తివేసి ఎన్నికలు నిర్వహించగా, దానిని విధించిన వారు ఘోరంగా ఓడిపోయారని వివరించారు. "ఎమర్జెన్సీ అనే ఘోర పాపం దానిని విధించిన వారి నుదుట శాశ్వతంగా నిలిచిపోతుంది. ఆనాడు ప్రజాస్వామ్యం కోసం దృఢంగా నిలబడిన ప్రతి ఒక్కరికీ ఈరోజు మనం వందనం చేస్తున్నాం. వారి వల్లే ప్రజాస్వామ్యం బతికింది" అని మోదీ పేర్కొన్నారు.

# నిజమే.. ఖలీస్థానీ ఉగ్రవాదులే!

**ఎయిరిండియా పేలుడు వెనుక ఖలిస్థానీలు.. 41 ఏళ్ల తర్వాత నిజం చెప్పిన కెనడా**




ఒట్టావా: నాలుగు దశాబ్దాలుగా చర్చనీయాంశంగా ఉన్న ఎయిరిండియా కనిష్క విమాన పేలుడు ఘటనపై కెనడా గూఢచారి సంస్థ సంచలన వ్యాఖ్యలు చేసింది. 1985 జూన్ 23న జరిగిన కనిష్క ఫ్లైట్-182 బాంబు పేలుడు వెనుక కెనడాలో కార్యకలాపాలు సాగించిన ఖలిస్థానీ తీవ్రవాదులే ఉన్నారని కెనడియన్ సెక్యూరిటీ ఇంటెలిజెన్స్ సర్వీస్ (సీఎస్ఐఎస్) అధికారికంగా పేర్కొంది. ఇటీవల భారత ప్రధాని నరేంద్ర మోదీ, కెనడా ప్రధాని మార్క్ కార్నీ భేటీ తర్వాత ఈ ప్రకటన రావడం ప్రాధాన్యం సంతరించుకుంది. సీఎస్ఐఎస్ నివేదికలో ఖలిస్థానీ తీవ్రవాదుల పాత్రను ఇంత స్పష్టంగా ప్రస్తావించడం ఇదే తొలిసారి అని అధికారులు చెబుతున్నారు. గతంలో ఈ ఘటనపై అనేక అనుమానాలు వ్యక్తమైనప్పటికీ కెనడా భద్రతా సంస్థ ఈ స్థాయిలో బాధ్యతను ఖలిస్థానీ వర్గాలపై మోపలేదు. భారత్‌తో సంబంధాలను మెరుగుపర్చుకునే దిశగా కెనడా ప్రభుత్వం ఇటీవల కీలక చర్యలు చేపడుతోంది. ఖలిస్థానీల కార్యకలాపాలను అరికట్టేందుకు కొత్త చట్టాలు తీసుకురావడంతో పాటు, విద్వేష ప్రచారంపై కఠిన చర్యలకు సిద్ధమవుతోంది. ఇటీవల కెనడా పార్లమెంట్ ఆమోదించిన 'కంబాటింగ్ హేట్ యాక్ట్' (బిల్ సీ-9) కూడా ఖలిస్థానీ వర్గాలకు ఎదురుదెబ్బగా మారనుంది. ఈ చట్టం అమల్లోకి వస్తే దేవాలయాల వద్ద నిరసనలు, విద్వేష ప్రచారం, బెదిరింపుల వంటి చర్యలపై కఠిన చర్యలు తీసుకునే అవకాశం ఉంటుంది. గత కొన్నేళ్లుగా కెనడాలో హిందూ దేవాలయాలపై దాడులు, భారత వ్యతిరేక నినాదాలు, తీవ్రవాదుల చిత్రాలతో ప్రదర్శనలు నిర్వహించడం వంటి ఘటనలు చోటుచేసుకున్నాయి. వీటిపై భారత ప్రభుత్వం పలుసార్లు ఆందోళన వ్యక్తం చేసింది. భారత్-కెనడా మధ్య భద్రతా సహకారం పెరగడం వల్ల పాకిస్థాన్ ఐఎస్ఐ మద్దతు పొందుతున్న ఖలిస్థానీ నెట్‌వర్క్‌లపై ఒత్తిడి పెరుగుతోందని భారత నిఘా వర్గాలు భావిస్తున్నాయి. ముఖ్యంగా బబ్బర్ ఖల్సా ఇంటర్నేషనల్ (బీకేఐ) వంటి సంస్థల కార్యకలాపాలు ఇటీవల తగ్గాయని చెబుతున్నారు. అయితే ఈ ఒత్తిడి కారణంగా తీవ్రవాద వర్గాలు నిరాశతో కొత్త కుట్రలకు పాల్పడే అవకాశం ఉందని భారత నిఘా సంస్థలు హెచ్చరిస్తున్నాయి. పంజాబ్ లేదా పొరుగు రాష్ట్రాల్లో పెద్ద ఎత్తున దాడులకు యత్నించే ప్రమాదం ఉందని అప్రమత్తం చేశాయి.

# అల్లంతదూరంలోనూ 'అగ్ని-5' దెబ్బ!

**చైనా లక్ష్యంగా భారత్ కొత్త వ్యూహం**



న్యూఢిల్లీ: భారత సైనిక ఆధునీకీకరణ కొత్త దశకు చేరుకుంటోంది. ఒకప్పుడు ప్రధానంగా పాకిస్థాన్‌ను దృష్టిలో పెట్టుకుని రక్షణ వ్యూహాలను రూపొందించిన భారత్.. ఇప్పుడు చైనా నుంచి ఎదురవుతున్న సవాళ్లపై మరింత దృష్టి సారిస్తోంది. ముఖ్యంగా వేల కిలోమీటర్ల దూరంలో ఉన్న లక్ష్యాలను ఛేదించగల దీర్ఘశ్రేణి క్షిపణులు, అధునాతన ఆయుధ వ్యవస్థల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తోంది. అంతర్జాతీయ పరిశోధనా సంస్థ సిప్రి తాజా నివేదిక ప్రకారం.. చైనా సైనిక శక్తి పెరుగుతుండటం, పాక్‌తో దాని వ్యూహాత్మక భాగస్వామ్యం బలపడటం భారత్ రక్షణ ప్రణాళికలపై ప్రభావం చూపుతోంది. ఈ నేపథ్యంలో దూరప్రాంతాల్లోని లక్ష్యాలను కచ్చితంగా ఛేదించే సామర్థ్యాలను భారత్ వేగంగా పెంచుకుంటోంది. గతంలో సుమారు 2,000 కిలోమీటర్ల పరిధి ఉన్న అణ్వాయుధ సామర్థ్య క్షిపణులకే పరిమితమైంది. ఇప్పుడు 3,000 కిలోమీటర్లకు పైగా ప్రయాణించే క్షిపణులను సైన్యంలోకి తీసుకొస్తోంది. ఈ ఏడాది జనవరి నాటికి భారత్ వద్ద 24 అగ్ని-5 ఖండాంతర బాలిస్టిక్ క్షిపణులు ఉన్నట్లు నివేదిక పేర్కొంది. ఈ క్షిపణి సుమారు 5,000 కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాలను చేరుకోగలదని అంచనా. ఆధునిక యుద్ధాల్లో డ్రోన్లు, సైబర్ దాడులు, కచ్చితమైన లక్ష్యఛేదన సామర్థ్యాల ప్రాధాన్యం పెరుగుతున్న నేపథ్యంలో భారత్ స్వదేశీ రక్షణ తయారీపై భారీగా పెట్టుబడులు పెడుతోంది. 2014-15లో రూ.46,400 కోట్లుగా ఉన్న దేశీయ రక్షణ ఉత్పత్తి విలువ.. 2024-25 నాటికి రూ.1.78 లక్షల కోట్లకు చేరుకుంది. రక్షణ ఎగుమతులు కూడా రికార్డు స్థాయిలో రూ.38,400 కోట్లకు పెరిగాయి. ప్రపంచవ్యాప్తంగా ఇటీవల చోటుచేసుకున్న యుద్ధాలు, ప్రాంతీయ ఘర్షణలు భారత్‌కు కొత్త పాఠాలు నేర్పాయని విశ్లేషకులు చెబుతున్నారు. దీంతో అధునాతన డ్రోన్లు, దీర్ఘశ్రేణి ఆయుధాలు, సాంకేతిక పరిజ్ఞానం బదిలీ ఆధారిత రక్షణ భాగస్వామ్యాలపై కేంద్రం మరింత దృష్టి పెడుతున్నట్లు నివేదిక పేర్కొంది.



# మనం కలిసే ఉన్నామా?

**ఉద్ధవ్ ఠాక్రే ఆవేదన!.. మహా కూటమిపై అనుమానం**

ముంబై: మహారాష్ట్ర విపక్ష కూటమి మహా వికాస్ అఘాడీ (ఎంవీఏ) తీవ్ర సంక్షోభంలో కూరుకుపోతున్నట్లు కనిపిస్తోంది. బుధవారం సాయంత్రం జరిగిన కీలక వ్యూహరచన సమావేశానికి కూటమికి చెందిన 60 మంది ఎమ్మెల్యేలలో ఏకంగా 23 మంది గైర్హాజరు కావడం రాజకీయ వర్గాల్లో ప్రకంపనలు సృష్టిస్తోంది. హాజరుకాని వారిలో ఎన్సీపీ అధినేత శరద్ పవార్, సీనియర్ నేత జయంత్ పాటిల్ వంటి ఉద్దండులు ఉండటం కూటమిలోని ఐక్యతపై తీవ్ర సందేహాలను రేకెత్తిస్తోంది. వ్యక్తిగత కారణాల వల్ల వారు హాజరు కాలేదని చెబుతున్నా, అసలు కారణాలు వేరే ఉన్నాయనే ప్రచారం జరుగుతోంది. ఈ సమావేశానికి కాంగ్రెస్ నేతలు నానా పటోలే, విజయ్ వడెట్టివార్ కూడా హాజరు కాలేదు. విజయ్ వడెట్టివార్ అనారోగ్యంతో ఉన్నారని ఆయన కార్యాలయం తెలిపింది. అయితే, కాంగ్రెస్ రాష్ట్ర యూనిట్ చీఫ్ హర్షవర్ధన్ సప్కల్, శివసేన (యూబీటీ) నేత సంజయ్ రౌత్ వంటి వారు హాజరయ్యారు. ఇటీవలే ఉద్ధవ్ ఠాక్రే వర్గానికి చెందిన ఆరుగురు ఎంపీలు ఏక్‌నాథ్ షిండే వర్గంలో చేరిన నేపథ్యంలో ఈ పరిణామం జరగడం ఎంవీఏ భవిష్యత్తును ప్రశ్నార్థకంగా మార్చింది. ఈ పరిణామాలపై ఉద్ధవ్ ఠాక్రే తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. 'మనం నిజంగా కలిసే ఉన్నామా?' అని ఆయన ప్రశ్నించారు. పార్టీ ఫిరాయించిన ఎంపీల గురించి మాట్లాడుతూ.. "వెళ్లిపోయిన వారిని వెళ్లనివ్వండి. మనతో ఉన్నవారిపై దృష్టి పెడదాం" అని నేతలకు పిలుపునిచ్చారు. అదే సమయంలో "మనం కలిసి ఉన్నామని చెబుతున్నాం. కానీ సభలో మహా వికాస్ అఘాడీగా మనం ఐక్యంగా ఉన్నామా? సమస్యలను కలిసికట్టుగా లేవనెత్తుతున్నామా?" అని తన అసంతృప్తిని వెళ్లగక్కారు. ఎంవీఏ ఇప్పటికీ ఒక పెద్ద శక్తి అని, సభ్యులందరూ కలిసి పనిచేయాలని, ఉమ్మడి సమావేశాలు, ర్యాలీలు నిర్వహించి ఐక్యతను ప్రదర్శించాలని ఆయన కోరారు.

# రష్యాకు భారత పెట్రోల్!

**ఉక్రెయిన్ దాడుల ఎఫెక్ట్**



మాస్కో: ఉక్రెయిన్ డ్రోన్ దాడులతో చమురు శుద్ధి కేంద్రాలు దెబ్బతినడంతో రష్యాలో పెట్రోల్ కొరత తీవ్రంగా వేధిస్తోంది. ఈ పరిస్థితిని ఎదుర్కొనేందుకు భారత్ నుంచి పెద్ద ఎత్తున పెట్రోల్ దిగుమతి చేసుకునే దిశగా రష్యా అడుగులు వేస్తున్నట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. ఉక్రెయిన్‌కు చెందిన కీవ్ పోస్ట్ కథనం ప్రకారం.. భారత్ నుంచి సముద్ర మార్గంలో పెట్రోల్ దిగుమతులను ప్రోత్సహించేందుకు రష్యా తన పన్ను చట్టాల్లో మార్పులు చేయాలని భావిస్తోంది. భారత్ నుంచి పెట్రోల్ దిగుమతి చేసే కంపెనీలకు సబ్సిడీలు అందించే ప్రతిపాదనకు రష్యా పార్లమెంట్ బడ్జెట్ కమిటీ మద్దతు తెలిపినట్లు సమాచారం. రష్యా-ఉక్రెయిన్ యుద్ధం ప్రారంభమైన తర్వాత రష్యా ముడి చమురుకు భారత్ అతిపెద్ద కొనుగోలుదారుగా మారింది. ప్రస్తుతం రోజుకు 15 లక్షల నుంచి 20 లక్షల బ్యారెళ్ల ముడి చమురును భారత్ కొనుగోలు చేస్తోంది. 2026 జూన్‌లో ఈ దిగుమతులు రోజుకు 26.6 లక్షల బ్యారెళ్ల రికార్డు స్థాయికి చేరినట్లు నివేదిక పేర్కొంది. భారత్‌లోని రిఫైనరీల్లో శుద్ధి చేసిన చమురులో కొంత భాగాన్ని పెట్రోల్, ఇతర ఇంధన ఉత్పత్తుల రూపంలో విదేశాలకు ఎగుమతి చేస్తున్నారు. 2025లో భారత్ పెట్రోల్ ఎగుమతులు రోజుకు 4 లక్షల బ్యారెళ్ల రికార్డు స్థాయికి చేరాయి. ఉక్రెయిన్ దాడుల కారణంగా రష్యా చమురు శుద్ధి సామర్థ్యం గణనీయంగా తగ్గింది. ప్రస్తుతం రోజుకు సుమారు 85 వేల టన్నుల పెట్రోల్ మాత్రమే ఉత్పత్తి అవుతోంది. వేసవి కాలంలో డిమాండ్ 1.11 లక్షల టన్నుల వరకు ఉంది. దీంతో రోజుకు దాదాపు 25 వేల టన్నుల కొరత ఏర్పడినట్లు నివేదిక వెల్లడించింది. పెట్రోల్ కొరత కారణంగా రష్యాలో ఇంధన ధరలు పెరుగుతున్నాయి. పరిస్థితి ఎంత తీవ్రంగా ఉందంటే కొందరు తేలికపాటి విమానాల నిర్వాహకులు విమాన ఇంధనానికి బదులుగా ఆటోమొబైల్ పెట్రోల్‌ను వినియోగించాల్సి వస్తోందని సమాచారం.

## భారత్‌కు లాభం ఉంటేనే అమెరికాతో డీల్

**కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ స్పష్టీకరణ**

న్యూఢిల్లీ: అమెరికాతో ప్రతిపాదిత వాణిజ్య ఒప్పందంపై కేంద్ర వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇతర దేశాల కంటే భారతీయ ఉత్పత్తులకు ప్రత్యేక ప్రయోజనం లభించని పక్షంలో అగ్రరాజ్యంతో ఎలాంటి ఒప్పందంపై సంతకం చేయబోమని స్పష్టం చేశారు. లండన్ పర్యటనలో మాట్లాడిన ఆయన భారత ఎగుమతిదారులకు అమెరికా మార్కెట్లో ప్రత్యేక అవకాశాలు కల్పించేలా చట్టపరమైన, విధానపరమైన వ్యవస్థను అమెరికా రూపొందించాల్సి ఉందన్నారు. ఆ అంశం ఖరారయ్యే వరకు ఒప్పందం కుదరదని తేల్చిచెప్పారు. భారత్-అమెరికా మధ్య జరుగుతున్న చర్చల్లో దిగుమతి సుంకాల తగ్గింపు కీలక అంశంగా మారింది. గతంలో భారత ఉత్పత్తులపై దాదాపు 50 శాతం వరకు ఉన్న సుంకాలను 18 శాతానికి తగ్గించే ప్రతిపాదన ఆధారంగా చర్చలు సాగాయని గోయల్ వెల్లడించారు. అలా జరిగితే భారత ఉత్పత్తులకు ఇతర దేశాల కంటే అమెరికా మార్కెట్లో ప్రయోజనం లభిస్తుందని పేర్కొన్నారు. అమెరికా వాణిజ్య ప్రతినిధి జేమిసన్ గ్రీర్‌తో ఇటీవల ఢిల్లీలో జరిగిన చర్చల అనంతరం కూడా ఇరు దేశాలు ద్వైపాక్షిక వాణిజ్యాన్ని విస్తరించేందుకు కట్టుబడి ఉన్నాయని కేంద్ర వాణిజ్య శాఖ తెలిపింది. అయితే పెండింగ్‌లో ఉన్న కీలక అంశాలపై ఇంకా తుది నిర్ణయం రాలేదు. ఈ ఏడాది ప్రారంభంలో మధ్యంతర వాణిజ్య ఒప్పందం దిశగా చర్చలు మొదలైనప్పటి నుంచి ఇది మూడో విడత చర్చలు కావడం విశేషం.

## వాణిజ్య ఎల్పీజీ సరఫరాపై ఆంక్షలు ఎత్తివేత

న్యూఢిల్లీ: పశ్చిమాసియా ఉద్రిక్తతల కారణంగా వాణిజ్య, పారిశ్రామిక అవసరాలకు వినియోగించే ఎల్పీజీ సరఫరాపై విధించిన ఆంక్షలను కేంద్ర ప్రభుత్వం పూర్తిగా ఎత్తివేసింది. అమెరికా-ఇరాన్ శాంతి ఒప్పందం, హర్మూజ్ జలసంధి తిరిగి తెరుచుకోవడంతో దిగుమతుల పరిస్థితి మెరుగుపడటమే ఈ నిర్ణయానికి కారణమని కేంద్ర పెట్రోలియం శాఖ వెల్లడించింది. సంక్షోభం సమయంలో నిలిపివేసిన బల్క్ ఎల్పీజీ సరఫరాలను కూడా ఇప్పుడు 50 శాతం మేర పునరుద్ధరించారు. దీంతో హోటళ్లు, రెస్టారెంట్లు, చిన్న పరిశ్రమలు, వాణిజ్య సంస్థలకు ఉపశమనం లభించనుంది. పశ్చిమాసియా సంక్షోభం సమయంలో దేశీయ వినియోగదారులకు ఎలాంటి కొరత రాకుండా ఉండేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఎల్పీజీ ఉత్పత్తి కోసం అవసరమైన సీ3-సీ4 గ్యాస్ వనరులను ఇతర రంగాలకు మళ్లించకుండా, పూర్తిగా గృహ వినియోగ ఎల్పీజీ తయారీకి కేటాయించింది. ఇప్పుడు పరిస్థితులు సాధారణ స్థితికి చేరుకోవడంతో ఆ పరిమితులను కూడా సడలించింది. అయితే దేశీయ ఎల్పీజీ ఉత్పత్తి రోజుకు కనీసం 40 వేల మెట్రిక్ టన్నుల కంటే తగ్గకుండా చర్యలు కొనసాగుతాయని కేంద్రం స్పష్టం చేసింది. అదే సమయంలో పెట్రోకెమికల్ రంగం అవసరాలను కూడా దృష్టిలో ఉంచుకుని సీ3-సీ4 వనరుల కేటాయింపును పెంచనుంది. ఇక పైప్డ్ నేచురల్ గ్యాస్ (పీఎన్‌జీ) విస్తరణపై కూడా ప్రభుత్వం దృష్టి సారించింది.



# డ్రగ్స్ లేని సమాజమే లక్ష్యం

## జగిత్యాల ఎస్పీ అశోక్ కుమార్.. దేశం కోసం యువతకు పిలుపు

జగిత్యాల, జూన్ 25 (ఈవార్తలు): డ్రగ్స్ లేని సమాజ నిర్మాణంలో యువత కీలక పాత్ర పోషించాలని జిల్లా ఎస్పీ శ్రీ అశోక్ కుమార్, ఐపీఎస్ పిలుపునిచ్చారు. జగిత్యాల పట్టణంలోని వాసవి గార్డెన్స్‌లో నిర్వహించిన మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలపై అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి యాంటీ డ్రగ్స్ వారియర్‌గా మారి సమాజాన్ని మాదకద్రవ్యాల నుంచి కాపాడాలని సూచించారు. ఉన్నత లక్ష్యాలను సాధించి తల్లిదండ్రులకు, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆయన కోరారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉ ఒడి మంచి విలువలను అలవర్చుకోవాలని సూచించారు. స్నేహితుల ఒత్తిడి లేదా ఆసక్తి కారణంగా కొందరు డ్రగ్స్ వైపు వెళ్లే ప్రమాదం ఉ ఒదని, అది జీవితాన్ని నాశనం చేస్తుందని హెచ్చరించారు. "డ్రగ్స్‌లో మొదటి అడుగు సరదాగా ప్రారంభమై చివరికి జీవితాన్ని చీకటిలోకి నెట్టేస్తుంది" అని ఆయన స్పష్టం చేశారు. డ్రగ్స్ వ్యాపారుల ప్రలోభాలకు లోనుకాకుండా ధైర్యంగా "నో" చెప్పాలని సూచించారు. మాదకద్రవ్యాల సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని, సమాచారం గోప్యంగా ఉంచబడుతుందని తెలిపారు. జిల్లా పోలీసు శాఖ డ్రగ్స్ నిర్మూలనపై కఠిన చర్యలు తీసుకుంటోందని ఆయన పేర్కొన్నారు.



# 'సర్'ను ప్రజల్లోకి తీసుకెళ్లాలి: గాజంగి నందయ్య

జగిత్యాల, జూన్ 25 (ఈవార్తలు): జగిత్యాల పట్టణంలో నిర్వహించిన ఎస్ఐఆర్ కార్యక్రమంలో జగిత్యాల జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు గాజంగి నందయ్య పాల్గొన్నారు. కార్యక్రమం అమలును పరిశీలించిన ఆయన, ప్రజలకు అవగాహన కల్పించడంలో బూత్ లెవల్ అధికారులు (బీఎల్ఓలు), బూత్ లెవల్ ఏజెంట్లు (బీఎల్ఏలు) కీలక పాత్ర పోషించాలని సూచించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సేవలు, సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా కృషి చేయాలని కోరారు. జిల్లా ప్రజలు ఎస్ఐఆర్ కార్యక్రమం ద్వారా లభించే అవకాశాలను సద్వినియోగం చేసుకుని, తమ వివరాలను సక్రమంగా నమోదు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రజల భాగస్వామ్యంతోనే ప్రభుత్వ కార్యక్రమాలు విజయవంతమవుతాయని, ప్రతి పౌరుడు తన హక్కులు, బాధ్యతల పట్ల అవగాహన కలిగి ఉండాలని గాజంగి నందయ్య అన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ మానపురి మహేష్ జమున, సిరిపురం మహేందర్, చాంద్ పాషా, ముఖేష్ కన్నా తదితరులు పాల్గొన్నారు.



# పారిశుద్ధ్య కార్మికుడి కుటుంబానికి సత్యం అండ

### ఆర్థిక సహాయం అందజేత.. బాధిత కుటుంబానికి భరోసా

గంగాధర, జూన్ 25 (ఈవార్తలు): కరీంనగర్ జిల్లా గంగాధర మండలం ఉప్పరమల్యాల గ్రామ పారిశుద్ధ్య కార్మికుడు లంకదాసరి మల్లయ్య గత పది రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. కరీంనగర్లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందగా పోస్టుమార్టం నిమిత్తం కరీంనగర్ సివిల్ హాస్పిటల్‌కు తరలించారు. కాగా, ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం బాధిత కుటుంబాన్ని కరీంనగర్ సివిల్ హాస్పిటల్ వద్ద పరామర్శించారు. పోస్టుమార్టం త్వరగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. అంత్యక్రియల నిమిత్తం బాధిత కుటుంబ సభ్యులకు రూ.10 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. భవిష్యత్తులో అండగా ఉంటానని బాధిత కుటుంబానికి భరోసా కల్పించారు.



# దీనబంధు కాలనీలో ఘనంగా హసన్-హుస్సేన్ దర్గా ఉర్సు

కూకట్‌పల్లి, జూన్ 25 (ఈవార్తలు): కూకట్‌పల్లి పరిధిలోని దీనబంధు కాలనీ రోడ్ నెం. 9లో హసన్–హుస్సేన్ దర్గా ఉర్సు కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కాలనీ అధ్యక్షుడు మహేందర్ నాయక్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా దర్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి, దేశంలో శాంతి, సామరస్యం, సౌభ్రాతృత్వం నెలకొనడంతో పాటు ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ప్రార్థించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆధ్యాత్మిక వాతావరణంలో కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్.డి. సలీం, ఎస్.డి. హుస్సేన్, చాంద్ బీ, ఇమామ్, చాంద్ పాషా తదితరులతో పాటు కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. నిర్వాహకులు వచ్చిన భక్తులకు కృతజ్ఞతలు తెలియజేశారు.



# 'సర్'ను పారదర్శకంగా నిర్వహించాలి: అయుబ్ ఖాన్

జగిత్యాల, జూన్ 25 (ఈవార్తలు): ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించాలని 34వ వార్డు కౌన్సిలర్ అయుబ్ ఖాన్ అన్నారు. జగిత్యాల పట్టణం 34వ వార్డులో ఎస్ఐఆర్ సర్వేలో భాగంగా అంగన్వాడీ కార్యకర్తలు శ్రీదేవి, లక్ష్మితో కలిసి ఆయన ఇంటింటికి తిరిగి ఎస్ఐఆర్ ఫారాలు పంపిణీ చేశారు. ప్రతి ఇంటిని తప్పనిసరిగా సందర్శించి అర్హులైన ఓటర్లకు ఫారాలు అందజేయాలని, ఓటర్ల సందేహాలను నివృత్తి చేస్తూ పూర్తి అవగాహన కల్పించాలని ఆయన సూచించారు. ఓటరు జాబితా సవరణలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా నిబంధనల ప్రకారం పని చేయాలని తెలిపారు. ఓటర్ల నుంచి అందిన ఫారాలను నిర్ణీత గడువులోగా స్వీకరించి అర్హులైన ప్రతి ఒక్కరి పేరు జాబితాలో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆయన పేర్కొన్నారు.

# ఎమర్జెన్సీ చీకటి అధ్యాయం: ఏసీఎస్ రాజు

## ఎమర్జెన్సీకి వ్యతిరేక పోరాట యోధులకు సన్మానం



జగిత్యాల, జూన్ 25 (ఈవార్తలు): మాజీ ప్రధాని ఇందిరా గాంధీ విధించిన ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా పోరాడిన యోధులను భారత్ సురక్ష సమితి కార్యాలయంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు ఏసీఎస్ రాజు సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1975 జూన్ 25న విధించిన ఎమర్జెన్సీ దేశ చరిత్రలో చీకటి అధ్యాయంగా నిలిచిందని అన్నారు. ఆ సమయంలో పత్రికా స్వేచ్ఛ, వాక్ స్వాతంత్ర్యం, ప్రజాస్వామ్య హక్కులు హరించబడ్డాయని విమర్శించారు. ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా నిలిచిన వాజపేయి, అద్వానీ, మురళీ మనోహర్ జోషి, మొరార్జీ దేశాయి, జయప్రకాశ్ నారాయణ వంటి నాయకులు ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం పోరాడారని గుర్తుచేశారు. 21 నెలల పాటు సాగిన ఆ కాలం నియంతృత్వ పాలనకు నిదర్శనమని పేర్కొన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం పోరాడిన యోధుల సేవలు మరువలేనివని ఆయన అన్నారు. జిల్లాలో పనిచేసిన ఎమర్జెన్సీ వ్యతిరేక పోరాట యోధులను సన్మానించడం గర్వకారణమని తెలిపారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# యువతకు కాంగ్రెస్ మోసం: కొమ్ము రాంబాబు



ధర్మపురి, జూన్ 25 (ఈవార్తలు): తెలంగాణలో నిరుద్యోగ యువతను కాంగ్రెస్ సర్కార్ పూర్తిగా విస్మరించిందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, ధర్మపురి అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ కొమ్ము రాంబాబు యాదవ్ ఆరోపించారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా ప్రభుత్వం నిరుద్యోగులను మోసం చేసిందని విమర్శించారు. జాబ్ క్యాలెండర్, జీవో నం.46 సవరణ వంటి అంశాలను పట్టించుకోవడం లేదని అన్నారు. గత రెండేళ్లుగా నోటిఫికేషన్ల కోసం నిరుద్యోగ యువత ఎదురుచూస్తూ ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఉద్యోగ నోటిఫికేషన్లు విడుదల చేసే వరకు బీజేపీ పక్షాన పోరాటం కొనసాగిస్తామని ఆయన పేర్కొన్నారు.

# 'సర్'లో అంతా భాగస్వాములు కావాలి: కంచి మహేందర్



కూకట్‌పల్లి, జూన్ 25 (ఈవార్తలు): రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభమైన ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమంలో ప్రతి పౌరుడు చురుకుగా పాల్గొని విజయవంతం చేయాలని బీజేపీ సీనియర్ నాయకుడు కంచి మహేందర్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, అర్హత కలిగిన ప్రతి పౌరుడి పేరు ఓటరు జాబితాలో ఉండేలా చూసుకోవడం అందరి బాధ్యత అని అన్నారు. 18 సంవత్సరాలు పూర్తి చేసుకున్న యువతీ యువకులు తప్పనిసరిగా తమ పేర్లను ఓటరు జాబితాలో నమోదు చేసుకోవాలని సూచించారు. ఒకే వ్యక్తి పేరు రెండు లేదా అంతకంటే ఎక్కువ ప్రాంతాల్లో నమోదై ఉ ఒటే, అలాంటి ద్వంద్వ నమోదుల (డబుల్ ఓట్స్) వివరాలను సంబంధిత బూత్ లెవల్ అధికారుల (బీఎల్‌వోలు) దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. అలాగే మరణించిన వారు లేదా శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు మారిన వారి పేర్లు జాబితాలో ఉంటే, వాటిని తొలగించే ప్రక్రియకు ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఇంటింటికీ వచ్చే బీఎల్‌వోలు, సంబంధిత సిబ్బందికి సరైన సమాచారం అందించాలని, ఓటరు వివరాల్లో పేరు, చిరునామా, వయస్సు లేదా ఇతర అంశాల్లో తప్పులు ఉంటే వెంటనే సవరణ కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రతి కుటుంబం తమ సభ్యుల ఓటరు నమోదు స్థితిని పరిశీలించి అవసరమైన మార్పులు, చేర్పులు చేయించుకోవాలని కంచి మహేందర్ అన్నారు. స్వచ్ఛమైన, ఖచ్చితమైన ఓటరు జాబితా ప్రజాస్వామ్య పరిరక్షణకు ఎంతో కీలకమని పేర్కొంటూ, "ప్రతి అర్హుడికి ఓటు – ప్రతి ఓటుకు విలువ" అనే లక్ష్యంతో అందరూ ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు.

# 'సర్'ను సద్వినియోగం చేసుకోవాలి

జగిత్యాల, జూన్ 25 (ఈవార్తలు): జగిత్యాల పట్టణంలోని వార్డు నం.46లో నిర్వహించిన ఎస్ఐఆర్ కార్యక్రమంలో జిల్లా మైనారిటీ సెల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్, మాజీ కౌన్సిలర్ సిరాజుద్దీన్ మన్సూర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. బూత్ లెవల్ అధికారులు (బీఎల్ఓలు), బూత్ లెవల్ ఏజెంట్లు (బీఎల్ఏలు) అప్రమత్తంగా, బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ఈ సందర్భంగా వార్డు నం.46లో కిజార్ అలీ నివాసానికి స్వయంగా వెళ్లి ఎస్ఐఆర్ ఫారాన్ని అందజేశారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన తెలిపారు. అర్హులందరికీ ప్రభుత్వ సేవలు చేరేలా సమర్థవంతంగా కార్యక్రమాన్ని అమలు చేయాలని, ప్రజల భాగస్వామ్యంతోనే ఇలాంటి కార్యక్రమాలు విజయవంతమవుతాయని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీఎల్ఓలు షహీన్, రిజ్వానా, ఆర్ఫీ సాయిదా, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# తప్పులకు తావులేకుండా 'సర్'

### అర్హులైన ప్రతి ఒక్కరికి ఓటు అవకాశం

### కలెక్టర్ సత్యప్రసాద్ వెల్లడి

జగిత్యాల రూరల్, జూన్ 25 (ఈవార్తలు): ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించాలని జగిత్యాల జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ అధికారులను ఆదేశించారు. జగిత్యాల రూరల్ మండలం చల్ గల్ గ్రామంలో బీఎల్‌వోలు ఇంటింటికి వెళ్లి ఎస్ఐఆర్ ఫారాలు పంపిణీ చేస్తున్న విధానాన్ని కలెక్టర్ ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఫారాల పంపిణీ, వివరాల నమోదు, అవగాహన కల్పన తదితర అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి పలు సూచనలు చేశారు. ప్రతి ఇంటిని తప్పనిసరిగా సందర్శించి అర్హులైన ఓటర్లకు ఫారాలు అందజేయాలని, ఓటర్ల సందేహాలను నివృత్తి చేస్తూ పూర్తి అవగాహన కల్పించాలని ఆయన సూచించారు. ఓటరు జాబితా సవరణలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా నిబంధనల ప్రకారం పని చేయాలని ఆదేశించారు. ఓటర్ల నుంచి అందిన ఫారాలను నిర్ణీత గడువులోగా స్వీకరించి వివరాలను క్షుణ్ణంగా పరిశీలించాలని, అర్హులైన ప్రతి ఒక్కరి పేరు జాబితాలో ఉండేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ప్రజలు కూడా ఈ ప్రక్రియలో చురుకుగా పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో మధుసూదన్, తహసీల్దార్ షాదబ్ హకీమ్, బీఎల్‌వోలు, సిబ్బంది, సర్పంచ్ జున్ను రాజేందర్, ఉప సర్పంచ్ రోమన్, తదితరులు పాల్గొన్నారు.

# నూకపల్లిలో మౌలిక వసతులు కల్పించాలి

### ఇళ్ల రద్దు నోటీసులు వెనక్కి తీసుకోవాలి

### మాజీ కౌన్సిలర్ హనుమండ్ల జయశ్రీ



జగిత్యాల టౌన్, జూన్ 25 (ఈవార్తలు): నూకపెల్లి వద్ద నిర్మించిన 4,350 డబుల్ బెడ్రూం ఇళ్ల కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించాలని మాజీ కౌన్సిలర్ హనుమండ్ల జయశ్రీ జిల్లా కలెక్టర్‌ను కోరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బస్సు సౌకర్యం, తాగునీరు, కరెంటు, మట్టి రోడ్లు, డ్రైనేజీ వంటి కనీస వసతులు లేకపోవడంతో లబ్ధిదారులు అక్కడ నివసించలేని పరిస్థితి ఉందన్నారు. దీంతో వారు తిరిగి పట్టణంలో అద్దె ఇళ్లలో ఉంటూ ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఇలాంటి పరిస్థితుల్లో నివాసం లేకపోవడంతో ఇళ్లను రద్దు చేస్తామన్న నోటీసులు ఇవ్వడం సరికాదని ఆమె పేర్కొన్నారు. ముందుగా అన్ని మౌలిక వసతులు కల్పించిన తర్వాతే నివాసంపై నిర్ణయం తీసుకోవాలని ఆమె వినతిపత్రంలో కోరారు.



# మాగంటి గోపీనాథ్‌కు ఘన నివాళి

హైదరాబాద్, జూన్ 25 (ఈవార్తలు): జూబ్లీహిల్స్ దివంగత ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ ప్రథమ వర్ధంతి సందర్భంగా ఆయన సతీమణి మాగంటి సునీత, తెలంగాణ ప్రైవేట్ ఉ ద్యోగుల ఫోరం (టీపీయూఎఫ్), తెలంగాణ వినియోగదారుల ఫోరం (టీవీఎఫ్) నాయకులు ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టీపీయూఎఫ్, టీవీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు పీఠం ప్రమోద్ కుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు నవీన్ పోగుల, ఏవీ ప్రమోద్‌తో పాటు నాయకులు యుగంధర్, ద్రోణాచార్య, ప్రసాద్ చౌదరి, రామకృష్ణ, శ్రీనివాస్, కిషోర్ తదితరులు పాల్గొని మాగంటి గోపీనాథ్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా సీనియర్ నాయకుడు నవీన్ పోగుల.. ప్రజలకు గోపీనాథ్ జూబ్లీహిల్స్ నియోజకవర్గ అభివృద్ధికి చేసిన కృషిని స్మరించుకున్నారు. ప్రజల సంక్షేమం కోసం నిరంతరం పనిచేసిన ఆయన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. మాగంటి గోపీనాథ్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లడం ద్వారానే ఆయనకు నిజమైన నివాళి అర్పించినట్టవుతుందని పేర్కొన్నారు.

# 29న డీజేఎస్ ధర్నా

### అక్రెడిటేషన్ల జారీలో అన్యాయంపై పోరు

హైదరాబాద్, జూన్ 25 (ఈవార్తలు): డెస్క్ జర్నలిస్టులకు అక్రెడిటేషన్ల జారీ విషయంలో జరుగుతున్న అన్యాయాన్ని నిరసిస్తూ ఈ నెల 29న హైదరాబాద్‌లోని సమాచార, పౌరసంబంధాల (ఐఅండ్‌పీఆర్) శాఖ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించాలని డెస్క్ జర్నలిస్టుల సంఘం (డీజేఎస్) రాష్ట్ర కమిటీ నిర్ణయించింది. గురువారం నిర్వహించిన రాష్ట్ర కమిటీ, సభ్యుల సమావేశంలో అక్రెడిటేషన్ల జారీ ప్రక్రియపై విస్తృతంగా చర్చించారు. గత కొన్ని నెలలుగా ప్రభుత్వం చేపట్టిన అక్రెడిటేషన్ల పంపిణీ ప్రక్రియలో హైదరాబాద్‌తో పాటు జిల్లాల్లోనూ అనేక మంది అర్హులైన డెస్క్ జర్నలిస్టులకు న్యాయం జరగలేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయమై ఇప్పటికే మీడియా అకాడమీ, ఐఅండ్‌పీఆర్ అధికారులకు పలుమార్లు వినతిపత్రాలు సమర్పించినప్పటికీ ఆశించిన ఫలితం రాకపోవడంతో ప్రత్యక్ష కార్యాచరణకు దిగాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. ఈ డిమాండ్ల సాధన కోసం ఈ నెల 29న నిర్వహించే ధర్నాకు రాష్ట్రంలోని అన్ని జర్నలిస్టు సంఘాలు మద్దతు తెలపాలని, హైదరాబాద్‌తో పాటు జిల్లాల నుంచి కూడా పెద్ద సంఖ్యలో జర్నలిస్టులు పాల్గొని విజయవంతం చేయాలని డెస్క్ జర్నలిస్టుల సంఘం రాష్ట్ర కమిటీ పిలుపునిచ్చింది.

నేటి ఈవార్తలు
COMMERCIAL RATE CARD
DISPLAY ADVERTISEMENTS
(with effect from 01.04.2026 (Per Sq.cm in Rupees))

| Position | B&W Rate | Colour Rate |
|---|---|---|
| Front Page | Rs.550 | Rs.1,000 |
| Page 3 / Back Page | Rs.350 | Rs.750 |
| Inside Pages | Rs.250 | Rs.500 |

CLASSIFIED LINES & CLASSIFIED DISPLAY:

BLACK & WHITE:
Price for 5 Lines – Rs.450
(for each extra line – Rs.90)

COLOUR:
Price for 5 Lines – Rs.500
(for each extra line – Rs.100)

Phone: +91 94404 55811
Email: contact@evarthalu.com

## లయ్కారి చిత్రం


ఆకాంక్ష పూరి





## కొరటాల-బాలయ్య సినిమా ప్రారంభం

నటసింహం నందమూరి బాలకృష్ణ, స్టార్ డైరెక్టర్ కొరటాల శివ కాంబినేషన్‌లో ఓ భారీ చిత్రం రాబోతున్నట్లు ప్రకటన వచ్చిన నాటి నుంచే ఇండస్ట్రీలో అంచనాలు పెరిగాయి. ఆ అంచనాలకు మరింత ఊపునిస్తూ, ఈ క్రేజీ ప్రాజెక్ట్ (వర్కింగ్ టైటిల్ 'చీదీఖ 112') ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి వేదికగా పూజా కార్యక్రమాలతో అట్టహాసంగా ప్రారంభమైంది. సినీ, రాజకీయ ప్రముఖుల సమక్షంలో జరిగిన ఈ వేడుక జరిగింది. ఈ చిత్రాన్ని ఎస్ఎల్వీ సినిమాస్ పతాకంపై నిర్మాత సుధాకర్ చెరుకూరి అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ సినిమాను సుమారు రూ. 150 కోట్ల నుంచి రూ. 200 కోట్ల భారీ బడ్జెట్‌తో పాన్ ఇండియా స్థాయిలో నిర్మిస్తున్నట్లు ప్రకటించారు. ఆగస్టు నెల నుంచి రెగ్యులర్ షూటింగ్ ప్రారంభించి, 2027 వేసవి కానుకగా ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయడానికి ప్రణాళికలు రచిస్తున్నట్లు తెలిపారు. అమరావతిలో ఈ సినిమాను ప్రారంభించడం వెనుక ఓ ప్రత్యేక కారణం ఉందని నిర్మాత సుధాకర్ చెరుకూరి వివరించారు. "రాజధాని అమరావతిలో ఒక భారీ సినిమా ప్రారంభోత్సవం చేయాలనేది బాలకృష్ణ గారి చిరకాల స్వప్నం. అది మా సినిమాతో నెరవేరడం చాలా గర్వంగా ఉంది. ప్రకాశం జిల్లా వాడినైన నేను, మన రాజధాని నడిబొడ్డున ఈ సినిమాను లాంచ్ చేయడం జీవితంలో మర్చిపోలేని అనుభూతి. గత మూడు నాలుగేళ్లుగా బాలయ్య గారితో సినిమా చేయాలన్న నా కోరిక ఇప్పటికి నెరవేరింది" అని ఆయన ఆనందం వ్యక్తం చేశారు.

## నా లైఫ్‌లో కాస్ట్‌లీ ఫ్రేమ్

డిఫరెంట్ కంటెంట్స్‌తో ప్రేక్షకులను కడుపుబ్బా నవ్విస్తూ మంచి క్రేజ్ తెచ్చుకున్న యంగ్ హీరో నవీన్ పొలిశెట్టి తాజాగా తన తదుపరి ప్రాజెక్టుపై అప్డేట్ ఇచ్చాడు. ఇండియన్ సినిమా ఇండస్ట్రీలోని టాప్ దర్శకులు, నిర్మాతలు, నటులు అయినా సుకుమార్, ప్రశాంత్ నీల్, లోకేష్ కనగరాజ్, కన్నడ నటుడు దర్శకుడు రిషబ్ శెట్టి, మైత్రీ మూవీ మేకర్స్ అధినేతలు నవీన్ యేర్నేని, రవిశంకర్, దర్శకుడు హరీశ్ శంకర్‌తో కలిసి నవీన్ పొలిశెట్టి ఓ వీడియోను పంచుకున్నారు. అంతే కాకుండా.. ఈ భారీ కలయికకు సంబంధించి ఓ పాన్ ఇండియా ప్రాజెక్ట్ రాబోతున్నట్లు తెలుపుతూ.. 'నా లైఫ్‌లో



కాస్ట్‌లీ ఫ్రేమ్.. లోకేష్ కనగరాజ్ రూ.500 కోట్లు, రిషభ్ శెట్టి రూ.800 కోట్లు, మైత్రీ నిర్మాతలు, సుకుమార్ కలిపి రూ.2000 కోట్లు, ప్రశాంత్ నీల్ రూ.2000 కోట్లు, చివరగా నావీ (నవీన్ పొలిశెట్టి వాటా) రూ.100 కోట్లు.. మొత్తం కలిపి ఇది రూ.5500 కోట్ల ఫ్రేమ్' అంటూ ఫన్నీగా చెప్పుకొచ్చాడు. అంతే భారీ ఫ్రేమ్‌లో సినిమా అంటే బాక్సాఫీస్ వద్ద కోట్ల వసూళ్లు రావాల్సిందే అంటూ నవీన్ షేర్ చేసిన ఈ వీడియో ప్రజెంట్ వైరల్ అవుతుండగా. దీనిపై మైత్రీ మూవీ మేకర్స్ స్పందిస్తూ.. 'మైత్రీ కుటుంబంలోకి మీకు స్వాగతం నవీన్ పొలిశెట్టి. 'స్టార్ ఎంటర్‌టైనర్'తో కూడిన పూర్తి స్థాయి వినోదభరితమైన చిత్రం రాబోతోంది.

## జియో హాట్‌స్టార్‌లోకి వచ్చేసిన 'అవతార్ 3'

హాలీవుడ్ ప్రముఖ దర్శకుడు జేమ్స్ కామెరాన్ అద్భుత సృష్టి, బాక్సాఫీస్ వద్ద కలెక్షన్ల సునామీ సృష్టించిన విజువల్ వండర్ "అవతార్: ఫైర్ అండ్ యాష్" (అవతార్ 3) ఎట్టకేలకు ఓటీటీ లోకి వచ్చేసింది. ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫామ్ జియోహాట్‌స్టార్ (జీఆశీఎశోర్ఘుతీ) వేదికగా ఈ విజువల్ వండర్ బుధవారం సాయంత్రం నుంచి స్ట్రీమింగ్ అవుతోంది. ఈ చిత్రాన్ని ఇంగ్లీష్‌తో పాటు తెలుగు, హిందీ, తమిళం, మలయాళం, కన్నడ భాషల్లో ప్రేక్షకులు వీక్షించవచ్చు. 'అవతార్' ఫ్రాంచైజీలో వచ్చిన ఈ మూడో భాగంలో దర్శకుడు జేమ్స్ కామెరాన్ సరికొత్త ప్రపంచాన్ని చూపించారు. మొదటి భాగంలో అడవులు, రెండో భాగంలో సముద్ర గర్భాన్ని అన్వేషించిన ఆయన.. ఈ 'ఫైర్ అండ్ యాష్'లో 'యాష్ పీపుల్' (బూడిద తెగ) అనే క్రూరమైన స్వభావం గల సరికొత్త నావి క్లాన్‌ను పరిచయం చేశారు.






## ఇదో డిఫరెంట్ మువీ

ఐశ్వర్య లక్ష్మి, విష్ణు విశాల్ జంటగా నటించిన లేటెస్ట్ మూవీ 'గట్ట కుస్తీ-2'. 2022లో వచ్చి బ్లాక్ బస్టర్ హిట్ అందుకున్న ఈ సినిమాకు సీక్వెల్‌గా రాబోతున్న ఈ మూవీపై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. అలాగే ఇప్పటి వరకు ఇందులో నుంచి వచ్చిన ప్రతి అప్డేట్ కూడా సినిమాపై హైప్‌ను క్రియేట్ చేశాయి. చెల్లా అయ్యావు తెరకెక్కిస్తున్న ఈ ఫ్యామిలీ డ్రామా జులై 3న ప్రేక్షకుల ముందుకు రాబోతున్నది. ఇందులో భాగంగానే తాజాగా ప్రమోషన్స్‌లో పాల్గొన్న ఐశ్వర్య లక్ష్మి తన తదుపరి ప్రాజెక్టులపై అప్డేట్ ఇచ్చింది. 'ప్రస్తుతం ఆ ప్రాజెక్ట్ గురించి మాట్లాడవచ్చో లేదో నాకు ఖచ్చితంగా తెలియదు. కానీ ఇది నా కెరీర్‌లో ఇప్పటివరకు చేసిన వాటికి భిన్నంగా, వేరొక భాషలో రూపొందుతున్న చిత్రం. ఇదొక సోషియోలాజికల్ థ్రిల్లర్‌గా రూపొందబోతుండగా.. దీనికి ఐశ్వర్య దర్శకత్వం వహిస్తున్నారు.



## రాజమౌళి ఒక కొత్త దర్శకుడు: పృథ్వీరాజ్

దర్శకధీరుడు ఎస్.ఎస్. రాజమౌళి పనితీరు, ఆయన అంకితభావం గురించి మలయాళ అగ్ర కథానాయకుడు పృథ్వీరాజ్ సుకుమారన్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. మహేశ్ బాబు కథానాయకుడిగా రాజమౌళి ప్రతిష్ఠాత్మకంగా తెరకెక్కిస్తున్న పాన్-ఇండియా చిత్రం 'వారణాసి'లో పృథ్వీరాజ్ ప్రతినాయకుడు 'కుంభ' పాత్రలో నటిస్తున్నారు. ఈ సినిమా షూటింగ్ అనుభవాలను ఆయన తాజాగా ఒక ఇంటర్వ్యూలో పంచుకున్నారు. హాలీవుడ్ రిపోర్టర్ ఇండియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో పృథ్వీరాజ్ మాట్లాడుతూ.. "నేను ఇప్పటివరకు కలిసి పనిచేసిన దర్శకులలో రాజమౌళి అత్యంత శ్రమజీవి. తొలి సినిమా అవకాశం కోసం దశాబ్దాలుగా వేచి చూస్తున్న ఓ నూతన దర్శకుడిలో ఉండే తపన, ఉత్సాహం ఆయనలో కనిపిస్తాయి. ప్రతి సన్నివేశాన్ని ఎంతో ఉత్సాహంతో, పూర్తి సన్నద్ధతతో ఆయన చిత్రీకరిస్తారు" అని ప్రశంసించారు. 'వారణాసి' సెట్స్‌లోని కఠినమైన పనివేళలను ఆయన ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు. ఉదయం 7 గంటలకు చిత్రీకరణ ప్రారంభం కావాల్సి ఉంటే, రాజమౌళి తెల్లవారుజామున 5:15 గంటలకే సెట్స్‌కు చేరుకుంటారని, నటీనటులు రాకముందే తన బృందంతో కలిసి పలుమార్లు రిహార్సల్స్ పూర్తి చేస్తారని వెల్లడించారు. భోజన విరామం కేవలం 20 నిమిషాలు మాత్రమే ఉంటుందని, ఒక్కోసారి ఆశించిన అవుట్‌పుట్ కోసం ఒకే సన్నివేశానికి 90కి పైగా టేకులు తీసుకున్న సందర్భాలు ఉన్నాయని చెప్పారు.

## ఓజీ2 వచ్చేశాడు!

పవర్ స్టార్ పవన్ కల్యాణ్ అభిమానులకు చిత్రబృందం అదిరిపోయే శుభవార్త చెప్పింది. ఆయన హీరోగా దర్శకుడు సుజీత్ తెరకెక్కించిన బ్లాక్‌బస్టర్ చిత్రం 'దే కాల్ హిమ్ ఓజీ'కి సీక్వెల్ రాబోతున్నట్లు అధికారికంగా ప్రకటించింది. కేవలం సీక్వెల్ మాత్రమే కాకుండా, ఇది 'ఓజీ యూనివర్స్'లో భాగంగా ఉండనుందని స్పష్టం చేసింది. ఈ మేరకు పవన్ కల్యాణ్ క్రియేటివ్ వర్క్స్ బ్యానర్‌పై ఈ ప్రాజెక్ట్ రానున్నట్లు వెల్లడించారు. పవన్ కల్యాణ్ క్రియేటివ్ వర్క్స్ తమ 'ఎక్స్' ఖాతాలో ఓ ప్రత్యేక వీడియోను పంచుకుంది. ఇందులో దర్శకుడు సుజీత్, పవన్ కల్యాణ్ 'ఓజీ' ఫ్రాంచైజీలోని రెండో భాగం గురించి చర్చిస్తున్న




దృశ్యాలు ఉన్నాయి. "తుఫానుకు ముందు ప్రశాంతత ఉంటుంది. గంభీర చెప్పని కథ ఇప్పుడు ఆవిష్కృతం కాబోతోంది" అని నిర్మాణ సంస్థ పేర్కొంది. సుజీత్ ఆలోచనలకు, కథనానికి ముగ్ధుడైన పవన్, తన వైపు నుంచి కావాల్సినదంతా సిద్ధంగా ఉంటుందని హామీ ఇవ్వడం ఈ వీడియోలో స్పష్టంగా కనిపించింది. ఈ సీక్వెల్ కేవలం ఓ కొనసాగింపు చిత్రం కాదని, అనేక పాత్రలు, వాటికి సంబంధించిన లోతైన కథలతో కూడిన ఓ పెద్ద సినిమాటిక్ అనుభూతిని ఇస్తుందని వీడియో ద్వారా తెలుస్తోంది. 'ఓజీ యూనివర్స్' పరిధిని వివరిస్తూ, సుజీత్ కొన్ని ఆసక్తికరమైన అంశాలను పవన్‌తో పంచుకున్నారు. సినిమాలో మంచు నెమ్మదిగా రక్తంగా మారే సన్నివేశం, ఓ రహస్యమైన 'అవుట్‌సైడర్' పాత్ర, 'ఓజీ' పెంపుడు జంతువు ప్రాముఖ్యత వంటి విషయాలను వివరించారు. 'ఓజీ 2'లో ఓ సన్నివేశం 'ఐకానిక్ విజువల్'గా నిలిచిపోతుందని పవన్ కల్యాణ్ వ్యాఖ్యానించడం ఇప్పుడు అభిమానుల్లో హాట్ టాపిక్‌గా మారింది.

## ఐటం సాంగ్‌లో నభా నటేశ్



మాస్ ఎలిమెంట్స్‌తో పాటు భక్తి, బలమైన కుటుంబ భావోద్వేగాల బ్యాక్ డ్రాప్‌లో తెరకెక్కిన ఇరుముడి చిత్రంలో రవితేజ ఎప్పుడూ చూడని విధంగా ఒక పవర్ ఫుల్ ఎమోషనల్ పాత్రలో కనిపిస్తూ ప్రేక్షకులను ఆకట్టుకోనున్నారు. ఇందులో ప్రియా భవాని శంకర్ హీరోయిన్‌గా నటిస్తుండగా.. మ్యూజిక్ డైరెక్టర్ జీవి ప్రకాష్ కుమార్ సంగీతం అందిస్తున్నాడు. అలాగే వరుస విజయాలతో దూసుకుపోతున్న అగ్ర నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ ఈ ప్రాజెక్టను ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తోంది. ప్రస్తుతం షూటింగ్‌లో వేగం పెంచి బ్యాక్ టు బ్యాక్ అప్డేట్స్ పంచుకుంటున్న ఈ చిత్రానికి సంబంధించిన తాజాగా మరో క్రేజీ వార్త నెట్టింట చక్కర్లు కొడుతోంది. 'ఇరుముడి'లో ఓ ప్రత్యేక పాట కోసం యంగ్ అండ్ హాట్ బ్యూటీ నభా నటేష్‌ను సంప్రదించారట మేకర్స్. రవితేజతో కలిసి ఈ స్పెషల్ సాంగ్‌లో నటించేందుకు నభా నటేష్ కూడా గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలుస్తుండగా.. దీనిపై అఫీషియల్ అనౌన్స్‌మెంట్ రానుంది.

నేటి ఈవార్తలు సంపాదకీయం Editorial

# సర్కారు సదువు నాణ్యతేది!

ఒక రాష్ట్ర అభివృద్ధిని కేవలం రహదారులు, భవనాలు, పరిశ్రమలతో మాత్రమే కొలవలేం. ఆ రాష్ట్రంలోని విద్యా వ్యవస్థ ఎంత బలంగా ఉందనేదే నిజమైన ప్రగతికి కొలమానం. ముఖ్యంగా ప్రభుత్వ పాఠశాలలు బలోపేతం కావడం అంటే సామాన్య కుటుంబాల పిల్లలకు నాణ్యమైన విద్య అందుబాటులోకి రావడం. తెలంగాణలో ఇటీవల ప్రభుత్వ పాఠశాలల మౌలిక సదుపాయాల మెరుగుదల, డిజిటల్ తరగతులు, ఆంగ్ల మాధ్యమం వంటి చర్యలు చేపట్టినప్పటికీ, విద్యా నాణ్యతను మరింత పెంచాల్సిన అవసరం ఇప్పటికీ స్పష్టంగా కనిపిస్తోంది. గ్రామీణ ప్రాంతాల్లోని అనేక కుటుంబాలకు ప్రభుత్వ పాఠశాలలే ప్రధాన ఆధారం. ప్రైవేట్ విద్యాసంస్థల్లో అధిక ఫీజులు చెల్లించే స్థోమత లేని తల్లిదండ్రులు తమ పిల్లల భవిష్యత్తును ప్రభుత్వ పాఠశాలలపైనే నమ్మి ఉంచుతున్నారు. అలాంటి పరిస్థితిలో అక్కడ అందే విద్యా ప్రమాణాలు మెరుగ్గా ఉండటం సామాజిక న్యాయానికి కూడా సంకేతం. అయితే, కొన్ని చోట్ల మౌలిక సదుపాయాల కొరత, ఉపాధ్యాయుల ఖాళీలు, విద్యార్థుల హాజరు సమస్యలు, అభ్యాస ఫలితాల్లో అసమానతలు వంటి సవాళ్లు ఇంకా కనిపిస్తున్నాయి. పాఠశాల భవనం అందంగా ఉండటం మాత్రమే సరిపోదు; తరగతి గదిలో బోధన నాణ్యంగా ఉండాలి. విద్యార్థుల్లో పఠన నైపుణ్యం, గణిత సామర్థ్యం, శాస్త్రీయ దృక్పథం, సృజనాత్మక ఆలోచన పెంపొందేలా బోధనా విధానాలు ఉండాలి. నేటి ప్రపంచంలో డిజిటల్ పరిజ్ఞానం కూడా అంతే ముఖ్యమైంది. కంప్యూటర్లు, ఇంటర్నెట్, స్మార్ట్ తరగతి గదులు అందుబాటులోకి వస్తున్నప్పటికీ, వాటిని సమర్థంగా వినియోగించేలా ఉపాధ్యాయులకు శిక్షణ అవసరం. సాంకేతికతను పాఠ్యాంశాలకు అనుసంధానం చేస్తే విద్యార్థుల్లో నేర్చుకునే ఆసక్తి పెరుగుతుంది. అదే సమయంలో తెలుగు, ఆంగ్ల భాషా ప్రావీణ్యం, గణితం, విజ్ఞానశాస్త్రం వంటి ప్రాథమిక అంశాలపై బలమైన పునాది ఏర్పడాలి. ప్రభుత్వ పాఠశాలలపై ప్రజల విశ్వాసం పెరగాలంటే కేవలం పరీక్ష ఫలితాలే కాదు, సమగ్ర అభివృద్ధి కూడా కనిపించాలి. క్రీడలు, కళలు, పర్యావరణ అవగాహన, నైతిక విలువలు, వ్యక్తిత్వ వికాసం వంటి అంశాలకు ప్రాధాన్యం ఇవ్వాలి. పాఠశాలలు సమాజంతో మమేకమై స్థానిక ప్రజాప్రతినిధులు, పూర్వ విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థల భాగస్వామ్యాన్ని ప్రోత్సహిస్తే మరింత మెరుగైన ఫలితాలు సాధించవచ్చు. విద్యార్థుల సంఖ్య పెరగాలంటే తల్లిదండ్రుల్లో నమ్మకం పెరగాలి. అందుకు ఉపాధ్యాయుల కృషి, పాఠశాల నిర్వహణలో పారదర్శకత, క్రమబద్ధమైన పర్యవేక్షణ, నాణ్యమైన బోధన కీలకం. విద్యను కేవలం ఉద్యోగం పొందడానికి ఉపయోగపడే సాధనంగా కాకుండా, బాధ్యతాయుత పౌరులను తీర్చిదిద్దే ప్రక్రియగా చూడాల్సిన అవసరం ఉంది. తెలంగాణలో ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ఇప్పటికే అనేక చర్యలు ప్రారంభమైనప్పటికీ, వాటి ప్రభావం ప్రతి గ్రామం, ప్రతి విద్యార్థికి చేరేలా నిరంతర కృషి అవసరం. ఉపాధ్యాయుల నియామకాలు, ఆధునిక బోధనా పద్ధతులు, సాంకేతిక వనరులు, మౌలిక సదుపాయాలు, తల్లిదండ్రుల భాగస్వామ్యం–ఈ ఐదు స్తంభాలపై దృష్టి పెడితే ప్రభుత్వ పాఠశాలలు మరింత బలపడతాయి. చివరగా, ఒక ప్రభుత్వ పాఠశాలలో చదివే చిన్నారి విజయం సాధిస్తే అది ఒక్క కుటుంబానికే కాదు, మొత్తం సమాజానికీ విజయమే. నాణ్యమైన ప్రభుత్వ విద్య అందరికీ అందుబాటులోకి రావడం ద్వారా సమాన అవకాశాలు పెరుగుతాయి, సామాజిక అసమానతలు తగ్గుతాయి, రాష్ట్ర అభివృద్ధికి దృఢమైన మానవ వనరులు సిద్ధమవుతాయి.



ప్రపంచవ్యాప్తంగా మతం పేరుతో విభేదాలు, విద్వేషాలు పెరుగుతున్న ఈ కాలంలో మొహరం వేడుకలు భారతీయ సంస్కృతిలోని నిజమైన విలువలను చాటిచెబుతున్నాయి. హిందూ–ముస్లిం సౌభ్రాతృత్వానికి ప్రతీకగా నిలిచిన ఈ వేడుకలు కేవలం ఒక మతపరమైన ఆచారం మాత్రమే కాదు; భిన్న విశ్వాసాల మధ్య పరస్పర గౌరవం, సహజీవనం, సామాజిక ఐక్యతకు సజీవ నిదర్శనం. నిజాం పాలన కాలం నుంచి కొనసాగుతున్న ఈ సంప్రదాయం తరతరాలుగా మల్యాల ప్రజల జీవితంలో భాగమైంది.

# మతాలకు అతీతమైన మనసుల పండుగ

ముస్లింలు హజ్రత్ ఇమామ్ హసన్, హజ్రత్ ఇమామ్ హుస్సేన్‌ల త్యాగాలను స్మరించుకుంటూ మొహరం నిర్వహిస్తుంటే, హిందూ కుటుంబాలు కూడా అదే భక్తిశ్రద్ధలతో ఈ వేడుకల్లో పాల్గొనడం విశేషం. పులివేషాలు, రాక్షస వేషాలు, యాదవ వేషధారణలు ధరించి మొక్కులు తీర్చుకోవడం, పీరీల వద్ద ధూపం వేయించి విభూది స్వీకరించడం వంటి ఆచారాలు ఈ ప్రాంతంలో మతాల మధ్య ఏర్పడిన సామాజిక బంధాన్ని ప్రతిబింబిస్తాయి. మొహరం సందర్భంగా వేలాది మంది భక్తులు తరలివచ్చి పీరీల ఊరేగింపులో పాల్గొనడం స్థానిక సంస్కృతికి ప్రత్యేక ఆకర్షణ. డప్పుల మోతలు, సాంప్రదాయ నృత్యాలు, రంగురంగుల వేషధారణలు, గ్రామ వీధుల్లో జరిగే ఊరేగింపులు జాతర వాతావరణాన్ని సృష్టిస్తాయి. ఈ సందర్భంగా స్థానిక వ్యాపారాలు ఊపందుకోవడం, చిన్నచిన్న వ్యాపారులకు ఉపాధి లభించడం కూడా గమనించదగ్గ అంశం. భారతదేశ చరిత్రలో సూఫీ సంప్రదాయం, స్థానిక జానపద విశ్వాసాలు, గ్రామీణ సంస్కృతి పరస్పరం కలిసిపోయిన ఎన్నో ఉదాహరణలు ఉన్నాయి. తెలంగాణలో బోనాలు, ఊరుసులు, దర్గాల జాతరలు, పీరీల పండుగలు వంటి సందర్భాల్లో అన్ని వర్గాల ప్రజలు పాల్గొనడం ఈ నేల ప్రత్యేకత. ఇక్కడ భక్తి కంటే మానవత్వానికే ఎక్కువ ప్రాధాన్యం కనిపిస్తుంది. ప్రస్తుత సమాజంలో సామాజిక మాధ్యమాల ద్వారా అపోహలు, విద్వేష ప్రచారం వేగంగా వ్యాపిస్తున్న నేపథ్యంలో ఇలాంటి వేడుకలు మరింత ప్రాధాన్యం సంతరించుకుంటున్నాయి. ఒకరి పండుగను మరొకరు గౌరవించడం, పరస్పరం సహకరించుకోవడం, కలిసికట్టుగా నిర్వహించడం వంటి విలువలు యువతకు ఆదర్శంగా నిలవాలి. మతం మనుషులను విడదీయడానికి కాదు, మంచితనంతో కలిపేందుకు అనే సందేశాన్ని ప్రజలు తమ ఆచరణతో చాటుతున్నారు. మరోవైపు ఇలాంటి సంప్రదాయాలను కేవలం ఉత్సవాలుగానే కాకుండా సాంస్కృతిక వారసత్వంగా పరిరక్షించాల్సిన అవసరం ఉంది. స్థానిక చరిత్ర, జానపద కళలు, పులివేషాలు, పీరీల ఊరేగింపులు వంటి అంశాలను భవిష్యత్ తరాలకు పరిచయం చేసే కార్యక్రమాలు చేపట్టాలి. పర్యాటక కోణంలో కూడా వీటికి గుర్తింపు కల్పిస్తే స్థానిక ఆర్థిక వ్యవస్థకు మేలు జరుగుతుంది. మొహరం మనకు ఒక గొప్ప పాఠాన్ని నేర్పుతోంది. భిన్న మతాలు, భిన్న సంప్రదాయాలు ఉన్నా మనుషుల మధ్య ప్రేమ, విశ్వాసం, పరస్పర గౌరవం ఉంటే సమాజం మరింత బలపడుతుంది. హిందూ–ముస్లిం ఐక్యతకు, సామాజిక సామరస్యానికి ఈ వేడుకలు చిరస్థాయిగా స్ఫూర్తినిస్తూ ఉండాలని ఆకాంక్షిద్దాం. ఇలాంటి సంప్రదాయాలే "భిన్నత్వంలో ఏకత్వం" అనే భారతదేశ మూల స్ఫూర్తిని సజీవంగా నిలబెడుతున్నాయి.



దూడం శ్రీశైలం
సీనియర్ జర్నలిస్టు,
9133947176
జగిత్యాల

# ప్రకృతి పంపిన నేరేడు సందేశం

వేసవి కాలం వచ్చిందంటే గ్రామీణ ప్రాంతాల్లో నేరేడు పండ్ల కోసం పిల్లల సందడి మొదలవుతుంది. కానీ ఈ ఏడాది కనిపిస్తున్న దృశ్యం మాత్రం భిన్నంగా ఉంది. రహదారుల పక్కన, చెరువుల గట్లపై, అడవుల అంచుల్లో నిలిచిన నేరేడు చెట్లు పండ్ల భారంతో వంగిపోతున్నాయి. మార్కెట్లలో ఎక్కడ చూసినా నేరేడు పండ్లే కనిపిస్తున్నాయి. చెట్ల కింద నల్లటి తివాచీ పరచినట్లుగా పండ్లు రాలిపడుతున్నాయి. ప్రకృతి ప్రేమికుడైనా, రైతైనా, గ్రామీణ జీవితాన్ని దగ్గరగా గమనించిన వృద్ధుడైనా ఒకే ప్రశ్న అడుగుతున్నాడు".. ఈసారి నేరేడు చెట్లు ఇంత విపరీతంగా ఎందుకు పండుతున్నాయి?" మన పెద్దల దగ్గర ఈ ప్రశ్నకు ఒక సరళమైన సమాధానం ఉండేది.



"నేరేడు చెట్లు అసాధారణంగా పండ్లు కాస్తే, ఆ ఏడాది ప్రకృతి ఏదో పెద్ద మార్పుకు సిద్ధమవుతోందని అర్థం" అని వారు చెప్పేవారు. అది కరువు కావచ్చు, తీవ్ర ఎండలు కావచ్చు, నీటి కొరత కావచ్చు. శాస్త్రీయ భాషలో చెప్పకపోయినా, ప్రకృతిని పరిశీలించి వచ్చిన అనుభవజ్ఞానం అది. ఆధునిక వృక్షశాస్త్రం కూడా ఇలాంటి కొన్ని సంఘటనలను వివరిస్తోంది. దీనిని "మాస్టింగ్" లేదా "బంపర్ ఫ్రూటింగ్" అని పిలుస్తారు. కొన్ని సంవత్సరాల్లో చెట్లు సాధారణ స్థాయిని మించి విపరీతంగా పండ్లు, విత్తనాలు ఉత్పత్తి చేస్తాయి. ఇది కేవలం దిగుబడి పెరుగుదల మాత్రమే కాదు; కొన్నిసార్లు చెట్టు తన మనుగడ వ్యూహంలో భాగంగా తీసుకునే సహజ నిర్ణయం కూడా కావచ్చు. చెట్టు ఒక జీవి. అది మాట్లాడదు కానీ ప్రకృతి సంకేతాలను చదువుతుంది. భూగర్భ జలాల క్షీణత, పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, వాతావరణ అస్థిరత వంటి మార్పులను చెట్టు తన వేర్ల ద్వారా, కణజాలాల ద్వారా గుర్తిస్తుంది. అలాంటి పరిస్థితుల్లో తన శక్తిని కొత్త కొమ్మలు, చిగుర్లు పెంచడంపై కాకుండా విత్తనాల ఉత్పత్తిపై కేంద్రీకరిస్తుంది. ఎందుకంటే ఒకవేళ భవిష్యత్తులో పరిస్థితులు మరింత కఠినమైతే, తన జాతి కొనసాగాలంటే ఎక్కువ విత్తనాలు నేలపై పడాలి.

ఇది ప్రకృతి చెప్పే గొప్ప పాఠం. ప్రమాదం ఎదురైనప్పుడు జీవితం వెనక్కి తగ్గదు; తనను తాను కొనసాగించే మార్గాన్ని వెతుక్కుంటుంది. నేరేడు చెట్ల ప్రత్యేకత ఏమిటంటే, వాటి వేర్లు చాలా లోతుగా వెళ్తాయి. పైభాగంలో కనిపించని భూగర్భ మార్పులను కూడా అవి ముందుగానే గ్రహించగలవు. అందుకే గ్రామీణ సమాజంలో నేరేడు, వేప, మర్రి వంటి చెట్ల ప్రవర్తనను ప్రకృతి సూచికలుగా పరిగణించేవారు. శాస్త్రవేత్తలు వాటిని "బయో–ఇండికేటర్లు" అంటారు. పెద్దలు మాత్రం "చెట్లు చెప్పే మాటలు" అని వ్యవహరించేవారు. అయితే ఒక విషయం స్పష్టంగా చెప్పాలి. ఈ ఏడాది నేరేడు పండ్లు ఎక్కువగా కాసాయని కచ్చితంగా కరువు వస్తుందని తేల్చేయడం సరైంది కాదు. ప్రకృతిలో ఏ ఒక్క సంఘటన కూడా ఒంటరిగా భవిష్యత్తును నిర్ణయించదు. కానీ ఇటువంటి సంకేతాలు మనల్ని అప్రమత్తం చేస్తాయి.



కాలగిరి శ్రీనివాస్ రెడ్డి
సీనియర్ జర్నలిస్ట్,
సెల్ : 9010128884

వాతావరణ మార్పులు వేగంగా పెరుగుతున్న ఈ కాలంలో వాటిని నిర్లక్ష్యం చేయడం కూడా ప్రమాదకరం. నేడు ప్రపంచం ఎదుర్కొంటున్న అతిపెద్ద సవాలు వాతావరణ మార్పు. ఒకవైపు రికార్డు స్థాయి ఎండలు, మరోవైపు అకస్మాత్తుగా కురిసే అతివృష్టి.. ఇవి ప్రకృతి సమతుల్యత దెబ్బతింటోందనే సంకేతాలు. ఈ నేపథ్యంలో నేరేడు చెట్టు మనకు ఒక మౌన సందేశం ఇస్తోంది. "నేను నా భవిష్యత్తు కోసం విత్తనాలు చల్లుతున్నాను. మీరు మీ భవిష్యత్తు కోసం ఏమి చేస్తున్నారు?" ఈ ప్రశ్నకు సమాధానం మన చేతుల్లోనే ఉంది. నీటిని పొదుపుగా వాడటం, భూగర్భ జలాలను సంరక్షించడం, చెట్లను కాపాడటం, కొత్త మొక్కలు నాటడం.. ఇవే మన బాధ్యతలు. ఈ వేసవిలో నేరేడు పండ్ల తీపిని ఆస్వాదించండి. కానీ వాటి వెనుక దాగి ఉన్న ప్రకృతి సందేశాన్ని కూడా వినండి. ఎందుకంటే కొన్నిసార్లు ప్రకృతి గట్టిగా అరవదు. ఒక చెట్టు పండ్ల రూపంలో నిశ్శబ్దంగా హెచ్చరిస్తుంది. ఆ హెచ్చరికను అర్థం చేసుకోవడమే మన విజ్ఞానం, దాన్ని గౌరవించడమే మన భవిష్యత్తు.

రచయితలకు ఆహ్వానం!

సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..

అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
'ప్రజావాణి' వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి 'ఈవార్తలు' పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్‌తో..!



పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9440455811

This newspaper is Owned and Published by **BOMMAKANTI SHRAVAN KUMAR** from H.No.4-36, Balwanthapoor, Mallial, Jagitial District, Telangana, 505452, Phone Number: 9440455811. Edited by **BOMMAKANTI SHRAVAN KUMAR** and Printed by M/s Kakatiya Printers at #2-24-96/9, Near Sri Krishna Pharma, Laxminarayana Nagar, Ida Uppal, Medchal Malkajgiri District, Telangana, 500039. PRGI REGD No.: TGTEL/25/A1385 . Corporate Office: #1-5-431/20/4, GS Pride, Plot No.4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri District, Telangana, 500010. Landline: 040-35673004.